ప్రజాశక్తి
గురువారం 10 ఆగస్టు 2023
5
కర్నూలు

లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సృజన, అధికారులు

నల్లచట్టాలను రద్దు చేయాలి

- కలెక్టరేట్ ఎదుట రైతు, కార్మిక సంఘాల నిరసన

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకున్న కార్మిక రైతు వ్యతిరేక నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని కార్మిక రైతు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎస్‌కెఎం , కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. క్విట్ కార్పొరేట్ సేవ్ ఇండియా సేవ్ అగ్రికల్చర్ అని రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నారాయణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు మాట్లాడారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థల్ని పెద్ద ఎత్తున కార్పొరేట్లకు అప్పచెబుతుందన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ దోపిడిదారులకు అప్పజెప్పిందన్నారు. ఈ దేశాన్ని వ్యవసాయ రంగాన్ని కాపాడాలని కార్పొరేట్లను తరిమికొట్టాలని డిమాండ్ చేశారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలన్నారు. దాదాపు సంవత్సరం కాలం పాటు రైతులు ఢిల్లీలో ఉద్యమించిన సందర్భంగా కొన్ని హామీలను నేటి వరకు అమలు చేయలేదన్నారు. దాంట్లో ప్రధానంగా కనీసం మద్దతు ధరకు కనీస మద్దతు ధర సీటు ప్లస్ 50 శాతం తో కలిపి ఇవ్వాలని, 2022 విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలన్నారు. రైతు రుణాలు మాఫీ చేయాలని రైతు ఉద్యమం సందర్భంగా చనిపోయిన 750 మంది రైతులకు పరిహారం ఇవ్వాలన్నారు. లక్షింపూర్ ఘటనకు బాధ్యులైన హోం శాఖ సహాయ మంత్రిని బర్తరపు చేయాలని రైతులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని తదితర డిమాండ్లను పరిష్కరించడానికి ప్రభుత్వం హామీ ఇచ్చి నేటి వరకు పరిష్కరించ లేదన్నారు. ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర బడ్జెట్లో నిధుల్లో కోత పెట్టిందని ప్రభుత్వ రంగ సంస్థలైన విశాఖ ఉక్కు రైల్వేలు ఓడరేవులు విమానయానాలు రోడ్లు ఎల్ఐసి బ్యాంకులను తదితర వాటిని ప్రైవేటుపరం చేయడం తగదన్నారు . మోడీ మిత్రుడు అదాని ఆస్తి 70 వేల కోట్ల నుండి రూ.16 లక్షల కోట్లకు పెరిగిందని, కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. కార్మిక చట్టాలు రద్దుచేసి కార్మిక కోడ్లు తెచ్చి కార్మికులను యాజమాన్యాలకు కట్టు బానిసలుగా మారుస్తుందన్నారు. కార్పొరేటర్ల దోపిడీ నుండి దేశాన్ని వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వ రంగాన్ని క్విట్ ఇండియా స్ఫూర్తితో కాపాడాలని దేశ ప్రజలకు పిలు ఇచ్చారు. తక్షణమే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జోక్యం చేసుకొని దేశాన్ని కాపాడాలన్నారు. నిరసన అనంతరం డిఆర్ఓ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళ కన్వీనర్ నిర్మల, సిఐటి యు జిల్లా నాయకులు రామాంజనేయులు, ఈరన్న, గోపాల్ , రాముడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వెంకటరాముడు, రైతు సంఘం జిల్లా నాయకులు కృష్ణ, రైతు కూలీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ నిరసన చేపడుతున్న నాయకులు

వైఎస్ఆర్ కల్యాణమస్తు ద్వారా

1076 మందికి రూ.8.61 కోట్లు

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వైఎస్ఆర్ కళ్యాణమస్తు,వైఎస్ఆర్ షాదీ తోఫా ద్వారా జిల్లాలో 1076 జంటలకు రూ.8.61 కోట్ల లబ్ది చేకూరినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. బుధవారం వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా ఆర్థిక సాయాన్ని తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించారు. కలెక్టర్, డిసిఎంఎస్ చైర్మన్ శిరోమణి, డిఆర్‌డిఎ పిడి నాగశివలీల తదితరులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు.కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ నుండి జూన్ 2023 త్రైమాసికంలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలలో ఉన్న ఆడపిల్లలకు వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా ద్వారా వారికి ఆర్థిక చేయూత అందిస్తూ అర్హులైన పేదింటి ఆడపిల్లల తల్లిదండ్రులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఈ పథకం లబ్ది పొందాలంటే పెళ్ళి నాటికి అమ్మాయి వయసు 18 సం.లు, అబ్బాయి వయసు 21సం.లు ఉండాలన్నారు. ఈ పథకాల వల్ల బాల్య వివాహాలు తగ్గడంతో పాటు ఆడపిల్లల చదువుకోవడానికి ప్రోత్సహించే అవకాశం ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్ష, కులాంతర వివాహం చేసుకున్న ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్షా 20 వేలు , బీసీలకు రూ.50 వేలు, కులాంతర వివాహం చేసుకున్న బీసీలకు రూ.75 వేలు, విభిన్న ప్రతిభావంతులకు రూ.లక్షా 50 వేలు, భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు రూ.40వేలు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయంగా అందజేస్తుందన్నారు. కర్నూలు జిల్లాలో వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీతోఫా పథకం ద్వారా ఏప్రిల్ నుండి జూన్ 2023 త్రైమాసికంలో నూతనంగా వివాహం చేసుకున్న మొత్తం 1076 మంది లబ్ధిదారులు (బీసీలు - 484 (ఒక్కటే కులం - 473, కులాంతర వివాహం - 11) , విభిన్న ప్రతిభావంతులు - 8, మైనారిటీస్ - 209, ఎస్సీ - 359 (ఒక్కటే కులం - 355, కులాంతర వివాహం - 4), ఎస్టీ - 16 (ఒక్కటే కులం-15, కులాంతర వివాహం-1) మంది లబ్ధి పొందారన్నారు. అనంతరం పథకం ద్వారా 1076 మంది లబ్ధి పొందిన వారికి మొత్తం రూ.8.61 కోట్ల మెగా చెక్కును జిల్లా కలెక్టర్, ఇతర అతిధులు అందజేశారు.

ఏజెంట్లు బిఎల్‌ఒలతో ఇంటింటి సర్వే

- రాజకీయ ప్రతినిధులతో కలెక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఓటర్ల జాబితా ఇంటింటి సర్వేలో రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లు బిఎల్‌ఒలతో కలిసి పాల్గొనాలని జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ డాక్టర్ జి.సృజన రాజకీయ పార్టీలను కోరారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎన్నికల అధికారి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. బుధవారం కలెక్టర్ జి.సృజన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించినారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా పత్రికలలో ప్రతికూల వార్తలు రావడం సహజం. వాటిని ఆధారంగా చేసుకుని జరుగుతున్న తప్పులను సరిదిద్దుకోవడానికి అవకాశం లభిస్తుందని తెలిపారు. కర్నూలు జిల్లాలో ప్రస్తుతం ఇంటింటి సర్వే 25శాతం మాత్రమే జరిగిందని రాష్టం మొత్తం ఇదేవిధంగా 25శాతం ఉందని తెలిపారు. ఆదోని , కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్లలో ఇంటింటి సర్వేలో ఒక్కో ఇంట్లో అధికంగా ఓటర్లు ఉన్నట్టుగా తెలుస్తుంది. దీనికి కారణం ఒక ఇంటి నంబర్‌లో వేర్వేరు నివాస గృహాలు ఉంటాయన్నారు. వాటిలో ఎక్కువ మంది ఉండే అవకాశం ఉంటుందన్నారు. ఒకే ఇంటి నెంబర్ ఉండడం వల్ల ఆ ఇంటిలో ఉన్న కుటుంబాల ఓటర్లు ఎక్కువగా ఆగుపడతారన్నారు. దీనికి రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు బిఎల్‌ఒలు సర్వే చేస్తున్నప్పుడు ఆ ఇంటి కి అదనంగా ఇంటి నెంబర్లు కేటాయించి సరి చేస్తారని తెలిపారు . ఈ విషయంపై ఇఆర్‌ఒలకు ,ఎఇఆర్‌ఒలకు ,బిఎల్‌ఒలకు సరయిన శిక్షణ ఇస్తామని తెలిపారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు బిఎల్‌ఒ లతో ఇంటింటి సర్వేలో పాల్గొన్నట్లయితే జరుగుతున్న ప్రక్రియలో సందేహాలు తొలగిపోతాయని తెలిపారు. జిల్లాలో మరణించిన ఓటర్ల లిస్టుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారి మరణ ధ్రువపత్రాలు లేదా పంచ నామాలు ఆధారంగా చేసుకుని అన్ని రికార్డులు సమకూర్చుకొని మరణించిన వారి ఓట్లను తొలగిస్తామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఈ సమావేశానికి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య , డిఆర్‌ఒ నాగేశ్వరరావు , ఎలక్షన్స్ సెల్ సూపరింటెండ్ మురళి , కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సత్యనారాయణ గుప్తా , బిఎస్‌పి జిల్లా ఇన్చార్జి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం

- గిరిజన భవనాన్ని ప్రారంభించిన కలెక్టర్ సృజన, కోడుమూరు ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను కర్నూలు మండలం బి.తాండ్రపాడులోని నూతనంగా నిర్మించిన గిరిజన భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు రూ. కోటి 35 లక్షలతో నిర్మించిన ఈ భవనాన్ని కలెక్టర్ డాక్టర్ జి.సృజన, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ప్రారంభించారు. కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు గిరిజన మహిళలు, గిరిజన విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. సాంఘిక సాంస్కృతిక కళారూపాలను అత్యంత ఉత్సాహభరితంగా ప్రదర్శించారు. అనంతరం కోడుమూరు ఎమ్మెల్యే గిరిజన మహిళలు, విద్యార్థులతో కలిసి ఆదివాసి నృత్యం చేస్తూ కొద్దిసేపు గడిపారు. గిరిజనలు ఈ భవనాన్ని తమ సామూహిక కార్యకలాపాల కోసం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సాంఘిక సంస్కృతిక ప్రదర్శన చేసిన విద్యార్థులకు కోడుమూరు ఎమ్మెల్యే చేతుల మీద బహుమతులు అందజేశారు. ఎంపిపి వాసు వెంకటేశ్వరమ్మ, జెడ్పిటిసి ప్రసన్నకుమార్, వైస్ ఎంపిపి నెహెమ్యా, విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు వై రాజు, రవి శాస్త్రి, లక్ష్మన్న, మోహన్ బాబు, దస్తగిరి, గిరిజన సంక్షేమ సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సృజన, కోడుమూరు ఎమ్మెల్యే

వక్కెర వాగుపై వంతెన నిర్మించాలి

- ఎమ్మెల్యే కాటసానికి వినతి పత్రం ఇచ్చిన కల్లూరు పరిరక్షణ సమితి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఎమ్మెల్యే కాటసానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వక్కెర వాగుపై నూతన వంతెన నిర్మించాలని కల్లూరు పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కల్లూరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వక్కెరవాగుపై నూతన వంతెన నిర్మించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్లూరు పరిరక్షణ సమితి అధ్యక్షుడు చంద్రశేఖరప్ప మాట్లాడుతూ కల్లూరు వక్కెర వాగు వంతెన దాదాపుగా 60 సంవత్సరాల క్రితం నిర్మించారని అది అప్పటి జనాభాకు సరిపడే విధంగా కాజ్ వే నిర్మించారని, ఇప్పుడు కర్నూలు నగరం విస్తరించి కల్లూరుతో పాటు పందిపాడు, లక్ష్మీపురం గ్రామాలు కూడా కర్నూలులో నగరంలో కలిసిపోయాయని అన్నారు. ఈ వంతెన పై నిత్యం వేలాది వాహనాలు ప్రయాణం చేస్తాయని అన్నారు . ఈ వంతెన పూర్తి శిథిలావస్థకు చేరుకొని రంధ్రాలు పడి రక్షణ గోడ లేక ప్రమాదం అంచున ఉందన్నారు. ఇప్పటికే వరద సమయంలో వంతెన ఎక్కి నీళ్ల పారడం వల్ల ప్రవాహాన్ని అంచనా వేయలేక చాలామంది కొట్టుకుపోయారని అన్నారు. చాలా మంది వాహనాలు వక్కెరవాగులో పడి తీవ్ర గాయాల పాలయ్యారన్నారు. కర్నూలు నగర కార్పొరేషన్ నడిబొడ్డున ఉన్న ఈ వంతెనను నిర్మించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్లూరు పరిరక్షణ సమితి నాయకులు గ్రామ పెద్దలు, రైతులు, సంఘల పెద్దలు వాడాల చంద్రశేఖర్ రెడ్డి, ఎన్‌వి.రామకృష్ణ ,ఎస్.రమణమూర్తి గోవిందు, బందికె జగదీష్, సంపతి దివాకర్ రెడ్డి , గొల్ల ఎస్.వెంకటేశ్వర్లు, బిదురుకోట ఈరన్న, కె.శంకరయ్య, అక్కెం విశ్వనాథం పాల్గొన్నారు.

పత్తికొండలో సివిల్ సప్లయిస్ గోడౌన్‌ను పరిశీలిస్తున్న విజయప్రతాపరెడ్డి

పేద పిల్లల కడుపు కొట్టొద్దు

ఎపి ఫుడ్ కమిషనర్ చైర్మన్ విజయ ప్రతాపరెడ్డి

ప్రజాశక్తి-పత్తికొండ

పేద పిల్లల చదివే హాస్టళ్లకు సరఫరా అయ్యే బియ్యం సక్రమంగా సరఫరా చేయకుండా మోసాలకు పాల్పడవద్దని ,పిల్లల కడుపు కొట్టొద్దని ఎపిఫుడ్ కమిషనర్ చైర్మన్ విజయ ప్రతాపరెడ్డి అధికారులను హెచ్చరించారు. పత్తికొండ పట్టణంలోని ఎపి ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాపరెడ్డి సివిల్ సప్లయ్ గోడౌను, అంగన్వాడి సెంటర్లను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పత్రికా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అంగన్వాడి సెంటర్లు, ప్రభుత్వ పాఠశాలలు, రేషన్ షాప్, సాంఘిక సంక్షేమ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హాస్టళ్లను ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ , ఇతర పథకాలు కింద అంగన్వాడి సెంటర్లకు , బాలింతలకు పిల్లలకు చిక్కీలు, గుడ్లు, పాలు, ఖర్జూర నాణ్యత గల వస్తువులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంపొందించామని తెలిపారు. నాణ్యత లోపిస్తే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పత్తికొండలో ఎండియు వాహనాలు స్ప్రింగ్ త్రాసును ఉపయోగించకుండా సొంత కాటాలు ఏర్పాటు చేసుకొని వేస్తున్నారని విలేకరుల అడగ్గా రిపేర్లు ఉంటాయని వెనకేసుకొచ్చారు. జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి షర్మిల,పత్తికొండ ఆర్‌డిఒ మోహన్‌దాసు, ఎమ్మార్వో విష్ణుప్రసాద్, పత్తికొండ సివిల్ గోడౌన్ ఇంచార్జ్ వెంకటేశ్వర్లు ,సిడిపిఒ సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

సి బెళగల్ మండలంలో అవీ :ఇవీ

ప్రజాశక్తి-సి బెళగల్

కంభదహాల్‌లో కోడుమూరు ఎమ్మెల్యే, మీ ఎమ్మెల్యే మీ సచివాలయం అన్న కార్యక్రమం చేపట్టి అర్జీలు స్వీకరించారు. కంభదహాల్ జగనన్న కాలనీలో ఇఒఆర్‌డి సందీప్, హౌసింగ్ ఎఇ సుమంత్ సిబ్బంది ఇళ్లపనులను తనిఖీ చేశారు. బురాన్ దొడ్డిలో సచివాలయంను తనిఖీ చేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. బెళగల్, బురాన్ దొడ్డి, కెజిబివి పాఠశాలలో ఎంఇఒ-2 ఆడమ్ బాషా మిడ్ డే మీల్స్ తనిఖీ చేసి భోజనాల నాణ్యతను పరిశీలించారు. సి బెళగల్ మండల పరిషత్ ముందు ప్రత్యేక అధికారి సమక్షంలో ఇఒఆర్‌డి సందీప్ ఎంపిపి మునెప్ప మొక్కలు నాటారు. పోలకల్‌లో సీఐ శ్యామ్‌రావు సర్వరోగ వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. సుమారు 300 మంది సద్వినియోగం చేసుకొన్నారు.టిడిపి మండల నాయకులు అయ్యస్వామి అనారోగ్యంతో అకాల మరణం చెందారు. పలువురు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో మతోన్మాదాన్ని తరిమికొడదాం

కెవిపిఎస్ ఆధ్వర్యంలో కుల మత ఉన్మాద దిష్టిబొమ్మ దగ్ధం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

భారత స్వాతంత్ర్యం కోసం అమరవీరులు కొనసాగించిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేటికీ దేశంలో కొనసాగుతున్న కుల ,వివక్షతను మత ఉన్మాదాన్ని తరిమికొడదామని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనందబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి. నారాయణ కోరారు. బుధవారం కర్నూలు పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందు కెవిపిఎస్, వ్యకాసం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో క్విట్ కులవివక్ష, క్విట్ మతోన్మాదం అని నినదిస్తూ.. కుల, మత ఉన్మాద 10 అడుగుల రాకాసి దిష్టిబొమ్మను దహనం చేశారు.కెవిపిఎస్ ఓల్డ్ సిటీ కార్యదర్శి ఆంద్రా గురుస్వామి అధ్యక్షతన జరిగిన దిష్టిబొమ్మ దహనం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎండి ఆనంద్ బాబు, కెవి.నారాయణ, కాటికాపరి గుంతలు తీసే బేగరుల సంఘం జిల్లా కార్యదర్శి ఎన్‌జి.కృష్ణ, న్యాయవాది రవికుమార్, కెవిపిఎస్ మహిళా నాయకురాలు డి విజయమ్మ, ఓల్డ్ సిటీ అధ్యక్షులు ఆర్.రమణ మాట్లాడారు. దేశంలోనే కుల అహంకారపు దాడులు జరుగుతున్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంటే, రాష్ట్రంలో కర్నూలు జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. జిల్లాలో ఏదో ఒక మూలన ప్రతి రోజు దళితులు, గిరిజనులపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. అంటరాని తనం, కుల వివక్షత, మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు కొన సాగుతున్న ఈ జిల్లాలో వాటి నిర్మూలన కోసం చేస్తున్న ప్రయత్నాలు మాత్రం శూన్య మన్నారు. మొన్నటికి మొన్న మొహరం సందర్భంగా ఆస్పరి మండలం వలిగొండ గ్రామంలో, ఆలూరు మండలం కమ్మరిచేడు గ్రామంలో అలాయి చుట్టూ సావుసోని ఆడరాదు అంటూ దళితులపై దాడి చేశారన్నారు. మంత్రాలయం మండలం రచ్చుమరి గ్రామంలో ఏరువాక పున్నమి సందర్భంగా పారు వేటలో పాల్గొన రాదని, పందాలలో ఆడరాదని దాడి చేశారన్నారు. ఇవేమో వ్యక్తిపై మరో వ్యక్తి చేసిన దాడి కాదని, అభాగ్యులైన దళితులపై కుల అహం కారంతో ఒక సమూహంగా చేసిన దాడి అన్నారు. ఇలాంటి ఘటనలు జరిగిన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్‌పిలు ఘటన ప్రాంతాలను సందర్శించి బాధితులకు అండగా నిలిచి ధైర్యం చెప్పాలని పున్నయ్య కమిషన్ సిఫారసులు చెబుతున్నా ఈ జిల్లాలో అలాంటి ప్రయత్నం మాత్రం జరగడం లేదన్నారు. మరోవైపు దేశంలో మత ఉన్మాద ఉగ్రవాదం పేట్రేగి పోతోందన్నారు. మణిపూర్ రాష్ట్రంలో మండుతున్న మంటలు చల్లారక ముందే, ఆ పక్కనున్న హర్యానా, ఉత్తర ప్రదేశ్, గుజరాత్, ఢిల్లీలకు ఈ మంటలు వ్యాపించాయన్నారు. వాటిని నియంత్రించాల్సిన పాలకులు వాటిని ఆర్పకుండా ఆ మంటల్లోనే ఓట్ల కోసం చలి కాచుకుంటున్నారన్నారు. భారత రాజ్యాంగం లోని 13 నుండి 17 ఆర్టికల్స్ ద్వారా అంటరానితనాన్ని సంపూర్ణంగా నిర్మూలించాలని నిర్దేశించిందన్నారు. చొరవలేని పాలకుల కారణంగా నేటికీ కొనసాగు తుందన్నారు. క్రిప్స్ రాయబారం తర్వాత భారత్ లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కుల వివక్షకు మత ఉన్మాదానికి వ్యతిరేకంగా కలిసి వచ్చే సంఘాలన్నిటినీ కలుపుకొని మరింత పెద్ద ఎత్తున ఉద్యమిద్దామని కోరారు. కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు చిన్న రోశన్న, సుధాకర్, వెంకటేశ్వర్లు, చక్రపాణి, నాగరాజు, కిరణ్, ప్రదీప్, వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షులు వెంకట రాముడు, కెవిపిఎస్ పట్టణ నాయకులు సోమన్న, కిరణ్, శ్రీధర్, శీను, పవన్, సురేష్, లక్ష్మన్న, నడిపి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కుల,మత ఉన్మాద దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

మహిళా మహాశక్తి కార్యక్రమాన్ని వివరిస్తున్న గౌరు చరిత

మహాశక్తి మహిళలకు ఉజ్వల భవిష్యత్తు : గౌరుచరిత

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

టిడిపి ప్రకటించిన మహాశక్తితో మహిళలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టిడిపి పాణ్యం ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. బుధవారం భవిష్యత్తుకు గ్యారెంటీ టిడిపి తోనే సాధ్యం అని మహాశక్తి కార్యక్రమాన్ని ఇంటింటి ప్రచారం కల్లూరు మండలం బస్తిపాడు గ్రామంలో నిర్వహించారు. తెలుగు మహిళా నాయకురాళ్లతో కలిసి గ్రామంలో తిరుగుతూ ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. మహాశక్తి ద్వారా లబ్ధి పొందే అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ మహాశక్తితోనే మహిళలకు మహాభ్యున్నతి సాధ్యమని, అందుకు టిడిపి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని అభ్యర్థించారు. మహిళల ఉజ్వల భవిష్యత్తు కాకుండా అందరి భవిష్యత్తుకు గ్యారెంటీ టిడిపితోనే అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, మాజీ ఎంపిపి వాకటి మాధవి, మాదేష్, కల్లూరు మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తమ రెడ్డి ,తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రహ్మణ పల్లె నాగిరెడ్డి, బిసి సెల్ రాష్ట కార్యదర్శి కాసాని మహేష్ గౌడ్, మైనారిటీ నాయకుడు దొడ్డిపాడు బాషా, గ్రామ కమిటీ మెంబర్ ధనుంజయ, బస్తిపాడు నాయకులు మాజీ సర్పంచి శేఖర్ రెడ్డి, సురేష్ రెడ్డి, మాజీ ఎంపిటిసి లక్ష్మన్న, రాజు, బోయ రాజు, ఉలిందకొండ ఇవి.రమణ, పెద్దటేకూరు వెంకటప్ప, జగదీష్, పూసులురు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి. అంజిబాబు డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులు మున్సిపల్ కార్మికులు గ్రీన్ అంబాసిడర్స్, విఒఎ ఆర్‌పిలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు సుభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంజిబాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటాలు కొనసాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చిన జగన్ హామీని అమలు పరచడంలో విఫలమయ్యారని అన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో విఒఎలను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఆర్‌పిలను వేధిస్తున్నారని వేధింపులను మానుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి , పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. గ్రీన్ అంబాసిడర్స్ వేతనాలు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే వేతనాలు చెల్లించాలని కోరారు. లేదంటే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఈరన్న, నారాయణస్వామి, మోహన్, రాముడు, బతకన్న, నాగరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

‘ మన సచివాలయం - మన ఎమ్మెల్యే’ ప్రారంభం

ప్రజాశక్తి -కోడుమూరు

కోడుమూరు నియోజ కవర్గ పరిధిలోని దీర్ఘ కాలిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ‘మన సచివాలయం - మన ఎమ్మెల్యే’ కార్యక్రమాన్ని అమడగుంట్లలో ఎమ్మెల్యే డాక్టర్ జె. సుధాకర్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని గ్రామ, వార్డు సచివా లయాలను ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల అమ లులో భాగంగా అన్ని విధాలుగా అర్హులైన వారిని గుర్తించి వారి వివ రాలను నమోదు చేసుకుని, విజయవాడలోని రాష్ట్ర సెక్రెటరేటరేట్‌లో వారి సమస్యలకు నేరుగా పరిష్కరిస్తామన్నారు. స్టేట్ ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ ,ఉప సర్పంచి మోదిన్ బాష, ఎంపిటిసి తిరుపతయ్య, కర్నూలు వ్యవ సాయ మార్కెట్ యార్డ్ వైస్‌చైర్మన్ భీమేశ్వర్ రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మంత్రి జయరామ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ప్రజా సంక్షేమం కోసమే 'గడపగడపకు'

- మంత్రి గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి - హాలహర్వి

ప్రజా సంక్షేమం కోసమే 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. బుధవారం మండలంలోని మజరా గ్రామమైన సిరిగాపురంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మంత్రి జయరామ్ పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి ఎంతో దృఢ సంకల్పంతో రాష్ట్రాభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన 'గడపగడపకు మన ప్రభుత్వం' ప్రజాదరణ పొందుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఏయే స్థాయిలో, ఏయే వర్గాలకు అందుతున్నాయో అని మంత్రి అడిగి తెలుసుకున్నారు. ముందుగా గ్రామ చింతకుంట నుంచి సిరిగాపురం గ్రామానికి బిటి రోడ్డు వేయాలని ప్రజలు మంత్రిని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ... రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు. ఎంపిపి నెట్టికంటమ్మ, జడ్‌పిటిసి లింగప్ప, వైసిపి మండల కన్వీనర్ భీమప్ప చౌదరి ఎంపిడిఒ ఆంథోని పాల్గొన్నారు. **ఆదోని**లోని 40వ వార్డు శుక్రవారం పేటలో రెండో రోజు కౌన్సిలర్ హిందు ఆధ్వర్యంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటూ ఎమ్మెల్యే ముందుకు సాగారు. మురుగుకాలువలు, డ్రెయినేజీలు, కల్వర్టులు, తాగునీటి సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమస్యలను వింటూ సత్వరమే పరిష్కార దిశగా ఎమ్మెల్యే చొరవ చూపారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ ఛైర్మన్ శాంత, వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు నరసింహులు, మహ్మద్ గౌస్, మున్సిపల్ ఇంజినీర్ నాగభూషణం రెడ్డి, మాజీ కౌన్సిలర్లు చంద్రకాంత్ రెడ్డి, సంజీవ్, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, స్టేట్ డైరెక్టర్లు రేణుక, మంజుల, వార్డు ఇన్‌ఛార్జి దుర్గప్ప, నాయకులు తాయన్న, రహీం, రామలింగేశ్వర్, చంద్ర, బీరప్ప, మమ్మత్తు స్వామి, జులేఖ, శ్రీదేవి, అన్నపూర్ణమ్మ, శ్రీలక్ష్మి, బ్రహ్మ, రఘు, అయ్యప్ప, ఆబు, చిన్న ఈరప్ప, శీన, లాల్ బాషా, ట్రాన్స్‌కో నాయక్, వార్డు అడ్మిన్ రాము ఉన్నారు. **ఎమ్మిగనూరు (రూరల్)** మండలంలోని కోటెకల్ గ్రామ పంచాయతీ చెన్నాపురం సచివాలయం-2లో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడాలి

- డిఇఒ రంగారెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

మాట్లాడుతున్న డిఇఒ రంగారెడ్డి

సైన్స్ ఆవిష్కరణలు సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడాలని డిఇఒ డాక్టర్ రంగారెడ్డి తెలిపారు. బుధవారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హిరోషిమా, నాగసాకి దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అణ్వాయుధాల విస్ఫోటనంతో భూమికి, ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. హిరోషిమా, నాగసాకి యుద్ధం జరిగినప్పుడు అణుబాంబుల వల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. సైన్స్ మంచి ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. సాంకేతికత అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. యుద్ధాన్ని కోరుకోకూడదని, ప్రపంచ శాంతిని కోరాలని తెలిపారు. 'సైన్స్‌ను సమాజ శ్రేయస్సుకు వినియోగిస్తామని, యుద్ధం వద్దు ప్రపంచ శాంతి ముద్దు' అని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎపి శాస్త్ర, సాంకేతిక మండలి జిల్లా కోఆర్డినేటర్ రంగమ్మ, మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, సైన్స్ ఉపాధ్యాయులు రవి, నాగరాజు, గిరిబాబు, సతీష్ పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ నీరందించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మంత్రాలయం

నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. త్వరలోనే తుంగభద్ర డ్యాం నుంచి దిగువన ఉన్న నదికి నీటిని విడుదల చేసే అవకాశం ఉందని తెలిపారు. ఆ నీటిని గురురాఘవేంద్ర ప్రాజెక్టులకు మళ్లించి నింపాలని సూచించారు. నదికి నీరు రాకముందే ఎక్కడైనా మోటార్లు మరమ్మతులు ఉంటే చేయించాలని, సమస్య తీవ్రంగా ఉంటే నివేదికలు సిద్ధం చేసి తనకు ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. వైసిపి మండలాధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఐరన్‌గల్ శ్రీనివాస్ రెడ్డి, జిఆర్‌పి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శైలేశ్వర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మురళీ, కృపానంద్, ఎఇలు హరిప్రసాద్, ప్రేమ్, రంగస్వామి, ఈశ్వర్, రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

కార్మికుల కడుపు కొడుతున్న మోడీ

- వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ

కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కార్మికుల కడుపు కొడుతున్న మోడీకి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని నాయకులు హెచ్చరించారు. బుధవారం 'క్విట్ కార్పొరేట్, 'సేవ్ ఇండియా'లో భాగంగా కార్మిక, రైతు, వ్యకాస పిలుపు మేరకు గాంధీ విగ్రహం ముందు నిరసన చేపట్టి, అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, సిఐటియు మండల కార్యదర్శి అశోక్, రైతుసంఘం మండల కార్యదర్శి సూరి, సీనియర్ నాయకులు శ్రీరాములు మాట్లాడారు. 1942లో దేశవ్యాప్తంగా జరిగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని రక్షించుకోవాలని కోరారు. మోడీ ప్రభుత్వం దేశంలో ఉన్న ఉద్యోగ, కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికులకు వ్యతిరేకంగా విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలైన బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, రైల్వేసంస్థలను ప్రయివేట్‌కు అప్పజెప్పడాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించాలని కోరారు. హమాలి, భవన, ఆటో కార్మికులకు సమగ్ర చట్టం చేయడం లేదని తెలిపారు. మోడీ విధానాలకు వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఆందోళనలు చేయాల్సి వస్తుందని, అందరూ పాల్గొనాలని కోరారు. రైతు, కార్మికులు, కూలీలు, ప్రజల డిమాండ్లను తహశీల్దార్ ద్వారా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఇవ్వాల్సిన వినతిపత్రాన్ని ఇవ్వడానికి ప్రయత్నించగా 'నేను సమావేశంలో ఉన్నాను. కుదరదు. సమావేశం తర్వాత తీసుకుంటాను' అని తహశీల్దార్ సమాధానం ఇచ్చారు. ఈ నేపథ్యంలో వినతిపత్రాన్ని తహశీల్దార్ కార్యాలయం తలుపులకు అతికించారు. ప్రజాసంఘాల నాయకులు ఓంకార్, రంగన్న, రాముడు, సామాజిక ఉద్యమ నాయకులు బంగి రంగన్న, రైతు నాయకులు పల్లెదొడ్డి రామాంజనేయులు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** మండల కార్యాలయం నుంచి సోమప్ప సర్కిల్ మీదుగా ర్యాలీగా బయల్దేరి తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఎఐటియుసి నాయకులు రంగన్న, సిఐటియు నాయకులు రాముడు, ఐఎఫ్‌టియు నాయకులు ప్రసాద్ అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా నాయకులు గోవిందు, సిపిఐ నాయకులు పంపన గౌడు, సిపిఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ) నాయకులు రాజు, రైతు సంఘం చిన్నన్న, కెసి.జబ్బర్, ఖాజా, ఏసోబు, రోషన్, మల్లికార్జున, రవి పాల్గొన్నారు. **ఆదోని** సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాల్ అధ్యక్షత వహించారు. ఐఎన్‌టియుసి నాయకులు దేవిశెట్టి ప్రకాష్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి అజయ్ బాబు, సిఐటియు జిల్లా నాయకులు మహానంద రెడ్డి, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు ఎంకప్ప, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మిరెడ్డి, వ్యకాస జిల్లా నాయకులు కె.లింగన్న, ఐఎఫ్‌టియు రైతు సంఘం నాయకులు మల్లికార్జున, మహిళా సంఘం నాయకులు మణి మాట్లాడారు. సిఐటియు నాయకులు తిప్పన, వీరారెడ్డి, ఎఐటియుసి ఎంకప్ప, ప్రకాష్ ఉన్నారు. **ఆస్పరి** తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తహశీల్దార్ కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. ప్రజా సంఘాల నాయకులు హనుమంతు, బాలకృష్ణ, రంగస్వామి, రామాంజినేయులు, రైతుసంఘం నాయకులు ఈరన్న, సత్యన్న, వ్యకాస నాయకులు రామాంజినేయులు పాల్గొన్నారు. **కౌతాళం**లో అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఆర్ఐ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య, రైతు కూలీ సంఘం మండల అధ్యక్షులు జగదీష్, రైతు సంఘం నాయకులు హనుమంతు, ఉలిగయ్య, సత్యప్ప, వలీ, మారయ్య, రైతు కూలీ సంఘం నాయకులు రత్నయ్య, వెంకోబ పాల్గొన్నారు.

దేవనకొండలో వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆదోనిలో నిరసన తెలుపుతున్న నాయకులు

ఎమ్మిగనూరులో నిరసన తెలుపుతున్న నాయకులు

ఘనంగా మహేష్ బాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని శివ థియేటర్‌లో బుధవారం సినీ హీరో మహేష్ బాబు 48వ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన థియేటర్ యజమాని వంశీ కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అతిథులకు శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. అనంతరం నూతన టెక్నాలజీ 4కె ప్రింట్ ద్వారా బిజినెస్ మ్యాన్ చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా సూపర్‌స్టార్ కృష్ణ అండ్ మహేష్ బాబు ఫ్యాన్స్ అధ్యక్షులు వహాబ్ మాట్లాడారు. 3 వేల పసిగుండెలకు ప్రాణం పోసిన మహోన్నతుడు మహేష్ బాబు అని కొనియాడారు. తెలుగు రాష్ట్రాల్లో రెండు గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేశారన్నారు. ఆనంద్, శ్రీనివాసులు, మధు, గిరీష్, సుమేద్, తారక్, శివ, అరుణ్, నరసింహులు, అంజి, యాదగిరి, మల్లి పాల్గొన్నారు.

వేడుకలు నిర్వహిస్తున్న అభిమానులు

చెట్లు, సైనికులు ప్రజల రక్షణలో భాగస్వాములు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

చెట్లు, సైనికులు ప్రజల రక్షణలో భాగస్వాములని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని రాంపురం గ్రామంలో 'నా భూమి - నా దేశం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెట్లు వాతావరణ కాలుష్యాన్ని నివారించి సకాలంలో వర్షాలు కురిసేందుకు, ఆక్సిజన్ అందించేందుకు దోహదపడతాయని తెలిపారు. సైనికులు దేశ సరిహద్దుల్లో రక్షణ కల్పించి ఊపిరి పోస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం అమరవీరుల ఆత్మకు శాంతి కలగాలని నినాదాలు చేసి గౌరవ వందనం సమర్పించారు. ఎమ్మెల్యే సెల్ఫీ ఫొటో తీసుకున్నారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ నారాయణ మూర్తి, ఎస్ఐ కిరణ్, ఎఇ నరసింహులు, ఎపిఎం జయశ్రీ, ఎంఇఒ మోహినుద్దీన్, ఎపిఒ తిమ్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఇస్రాత్ బాష పాల్గొన్నారు. **గోనెగండ్ల** మండలంలోని వివిధ గ్రామాల్లో మొక్కలు నాటారు. చిన్న మరివీడు, అల్వాల గ్రామాల్లో డిపిఒ నాగరాజు నాయుడు పాల్గొని 75 ఏళ్ల స్వాతంత్ర్యానికి గుర్తుగా అల్వాల సర్పంచి బాష, చిన్నమరివీడు సర్పంచి శిరోమణమ్మతో కలిసి 75 మొక్కలు నాటారు. మాతృభూమికి వందనం సమర్పించారు. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో అమరులైన వీరులకు వందనం సమర్పించారు. అనంతరం పాఠశాలల చిన్నారులు, అధికారులు, సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. గోనెగండ్ల ఎంపిడిఒ కార్యాలయం వద్ద సర్పంచి హేమావతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, జెడిఎ వరలక్ష్మి పాల్గొన్నారు. ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నగేష్, ఏపీఓ అలీ పీరా, ఈసీ ఉస్మాన్ బాష పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలంలోని బంటనహాల్ గ్రామంలో సర్పంచి సుశీలమ్మ అధ్యక్షతన ఎపిఒ మాధవ శంకర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ముఖ్య అతిథులుగా ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ హాజరయి మొక్కలు నాటారు. ఎంపిడిఒ కొండయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రమీల, వైసిపి నాయకులు రాజన్న, పరమేష్, తిరుమలేష్, సతీష్ పాల్గొన్నారు.

పాఠశాలలో విద్యాబోధనపై ఆరా : బంటనహాల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పర్యటించి విద్యా బోధన ఎలా ఉందని గుమ్మనూరు నారాయణ ఆరా తీశారు. అలాగే తాగునీటి వసతి, మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉంటుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పాఠశాల అభివృద్ధిపై చర్చించారు. అనంతరం పీర్ల చావిడి పునర్నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందించారు. ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రాలయంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

గోనెగండ్లలో మొక్కలు నాటుతున్న డిపిఒ

చిప్పగిరిలో మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణ

మోడల్ స్కూల్ టీచర్లకు బదిలీలు చేపట్టాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్ రూపొందించి పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, 010 పద్దు కింద జీతాలు చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.ఎల్లప్ప డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కడివెళ్ల మోడల్ స్కూల్‌ను సందర్శించి ప్రిన్సిపల్ రాఘవేంద్రారెడ్డి, ఉపాధ్యాయులతో సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. త్వరలో 19 ప్రిన్సిపల్ పోస్టులకు, 272 పిజిటి పోస్టులకు పదోన్నతి కల్పిస్తున్నారని తెలిపారు. పదోన్నతి కంటే ముందు బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ పర్యవేక్షణలో మోడల్ స్కూల్ ఉన్నప్పటికీ హెల్త్ కార్డులు లేవని తెలిపారు. హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, కారుణ్య నియమాకాలు చేపట్టాలని కోరారు. యుటిఎఫ్ నాయకులు ఎం.రాజు, బి.రామాంజనేయులు, ఎ.భాస్కర్, షంషుర్, కేశన్న, ఈరన్న పాల్గొన్నారు.

విఆర్ఎ మృతికి ఘన నివాళి

ప్రజాశక్తి -పెద్దకడబూరు

మండలంలోని చిన్నతుంబలం గ్రామానికి చెందిన విఆర్ఎ గోవిందు గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, విఆర్ఎలు భీమన్న, నాగరాజు, నరసింహులు, హుస్సేని, రమేష్, వీరేష్, హనుమంతు, రోగన్న, లక్ష్మన్న, గోపాల్‌లు గోవిందు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

టిడిపితోనే బలహీన వర్గాల అభివృద్ధి : మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - నందవరం

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి టిడిపి కృషి చేసిందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం నందవరం 14, 15, 16వ వార్డుల్లోని వైసిపి చెందిన దాదాపు 80 కుటుంబాలు టిడిపి మండల యువ నాయకులు గురురాజ్ దేశాయి ఆధ్వర్యంలో బీవీ సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ సబ్‌ప్లాన్‌కు నిధులు కేటాయించి, ఎస్సీలను ఆదుకోవడంలో ప్రత్యేక చొరవ చూపారన్నారు. పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు ఇస్తామని, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రోగన్న, బజారి, పెద్ద నరసన్న, మెసేక్, ఆనంద్, రంగన్న, రాజు, లాజరు, నాగరాజు ఉన్నారు.

బీవీ, గురురాజ్ సమక్షంలో పార్టీలో చేరుతున్న కాలనీ వాసులు

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT ADONI

O.S.No. 445/2019

BETWEEN:

K. Krishna Reddy ... Plaintiff

AND

Narasimhappa died by Lr's and 3 others .... Defendants

SUMMONS

To:

1. Ullesh, S/o Chakali Pompanna, R/o 111 Madire village, Adoni.
2. Suri S/o Chakali Pompanna, R/o 111 Madire village, Adoni.

Whereas the above named plaintiff has filed the suit against You no.1 and 2. The Hon'ble Court was pleased to permit the plaintiff to serve the summons to you no.1 and 2 by way of paper publication. Therefore you no.1 and 2 are hereby directed to appear before this Hon'ble Court on 24/08/2023 at 10:30 AM either in person or through your Advocate and file your objections if any, failing which the matter will be decided in your absence.

L.K. JEEVAN SINGH
BE, LL.B
Advocate for Plaintiff
Adoni.

మహారాజ శ్రీ అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి : గద్వాల
జోగులాంబ గద్వాల జిల్లా.
ఇ.పి.నెం.29/2017 ఇన్ ఓ.యస్.నెం.52/2005

పులుసూరు సుదర్శన్ తండ్రి పి.శేషన్న,
ఇంటి.నెం.40/740-సి, ధర్మపేట,
కర్నూలు టౌన్. ...డి.హెచ్.ఆర్

-ఎదురి-

మద్దూరు వెంకట్రామిరెడ్డి డైడ్ బై ఇతని వారసులు. ...జె.డి.ఆర్స్

వేలం ప్రకటన

మద్దూరు వెంకట్రామిరెడ్డి డైడ్ బై ఇతని వారసులు
1.శ్రీమతి శారదమ్మ భర్త లేటు యం.వెంకట్రామిరెడ్డి, వయస్సు 59 సంవత్సరాలు.
2. యం.రాఘవేంద్రర్ రెడ్డి తండ్రి లేటు యం.వెంకట్రామిరెడ్డి, వయస్సు 26 సంవత్సరాలు.
3.యం.గిరీశ్వర్ రెడ్డి తండ్రి లేటు యం.వెంకట్రామిరెడ్డి, వయస్సు 24 సంవత్సరాలు.
అందరి నివాసం చాగా పురం గ్రామము, ఇటిక్యాల మండలం, ప్రస్తుతం అందరి నివాసం ఉండే ప్రాంతము, నిడ్జూరు గ్రామం, కర్నూలు మండలం, కర్నూలు జిల్లా.

యం.వెంకట్రామిరెడ్డి, గారు చేసిన అప్పుకుగాను కోర్టు ద్వారా ఈ క్రింది ఉదాహరించిన జె.డి.ఆర్స్ యొక్క అనుభవంలో ఉండి వ్యవసాయం చేయుచున్న భూమి మరియు ఎగ్జిక్యూషన్ పిటిషన్ క్రింది షెడ్యూలు దాఖలు చేయబడిన భూమిని పై కోర్టువారు తేది 24-8-2023 ఉదయం 10.30 గంటలకు వేలం వేయుటకు కోర్టు వారు నిర్ణయించినారు. కావున కావలసిన వారు వేలం పాటలో పాల్గొనవచ్చును.
దిగువ షెడ్యూలు భూమిపై ఎలాంటి అన్యాక్రాంతము చేయలేదు. మరియు జె.డి.ఆర్స్. వ్యవసాయం చేస్తూ తన అధీనంలో ఉన్న భూమి జోగులాంబ గద్వాల జిల్లా, చాగాపురం గ్రామం,ఇటిక్యాల మండలం, అలంపూర్ సబ్-రిజిస్ట్రేషన్ ఆఫీస్ పరిధిలో గల భూమి హద్దులు: ఈ యొక్క భూమిని యలగమాన్ చేను అంటారు. సర్వే నెం.331/ఎ-1, ఎకరములు : ఎ.5-13 గుంటలు.

హద్దులు:
తూర్పు : యమ్.రామిరెడ్డి పొలం.
పడమర : చిన్న నాగిరెడ్డి పొలం.
ఉత్తరం : పెద్దనాగిరెడ్డి పొలం
దక్షిణం : బాపిరెడ్డి పొలం.

వేలం వేయు తేది : 24-08-2023

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 24-8-2023

కె.ఆనందరావు
బి.రాజేష్‌కుమార్,
అడ్వకేట్స్ ఫర్ జె.డి.ఆర్స్,
గద్వాల.

పకడ్బందీగా పంటకోత ప్రయోగాలు

- జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని అన్ని గ్రామాల్లోనూ పంట కోత ప్రయోగాలను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి పిఎల్.వరలక్ష్మి తెలిపారు. బుధవారం గోనెగండ్లలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో పంట కోత ప్రయోగాలపై రైతు భరోసా కేంద్రాల ఇన్‌ఛార్జిలకు శిక్షణ నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ప్రయోగాల వల్ల మంచి దిగుబడిని తెలుసుకోవచ్చని తెలిపారు. పంటకోత ప్రయోగాలు పంటల బీమా, పంట నష్టపరిహారం రావడానికి ముఖ్యపాత్ర పోషిస్తాయని చెప్పారు. అనంతరం ఉపగణాంకాధికారి గంగన్న మాట్లాడారు. వరి, పత్తి, మిరప, వేరుశనగ, ఉల్లి పంటల్లో పంట కోత ప్రయోగాలు ఎలా చేయాలో వివరించారు. ఎమ్మిగనూరు ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, గోనెగండ్ల ఎఒ జి.హేమలత, ఎఎస్ఒ వెంకటేశ్వర్లు, ఉద్యాన శాఖ అధికారి శ్రీవాణి పాల్గొన్నారు.

ఆర్‌బికెలు, సచివాలయ నిర్మాణాల పరిశీలన

గోనెగండ్లలో సచివాలయాలు, ఆర్‌బికెల నిర్మాణాల పురోగతిని మండల ప్రత్యేకాధికారి పిఎల్.వరలక్ష్మి పరిశీలించారు. ఆర్‌బికె 1, 2, సచివాలయం-4 వద్ద జరుగుతున్న నిర్మాణ పనులను ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నగేష్‌తో కలిసి పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని గుత్తేదారులకు సూచించారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- ఎమ్మెల్యేకు ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - మంత్రాలయం

తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని విద్యుత్ ఉద్యోగులు కోరారు. బుధవారం మండలంలోని ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ఎడి విశ్వ శాంతి స్వరూప్, రాఘవేంద్రప్ప, ఎఇ గోవిందు మాట్లాడారు. ఉద్యోగుల పిఆర్‌సి, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. సచివాలయ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించాలని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రుద్రప్ప, ఎఇఒ చంద్ర బోస్, లైన్ మెన్‌లు తిమ్మప్ప, రంగస్వామి ఉన్నారు.

చిన్నారులకు నాణ్యమైన ఆహారమివ్వాలి

- ఫుడ్ కమిషన్ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి
- అంగన్వాడీ టీచర్‌కు మెమో

ప్రజాశక్తి - ఆదోని

అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని ఫుడ్ కమిషన్ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆదోనిలోని బండిమెట్ట వీధిలో సెంటర్ నెంబర్-88ని సందర్శించి అక్కడ రికార్డులను తనిఖీ చేశారు. నిల్వ ఉన్న స్టాకు, రికార్డుల్లో పొందుపరిచిన స్టాక్ వివరాలకు పొంతన లేకపోవడంతో నిలదీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రక్తహీనతను పారదోలేందుకు ప్రభుత్వం రాగి, గోధుమ పిండి, గుడ్లు, ఇతర సరుకులు ఇస్తోందని తెలిపారు. వాటిని పంపిణీ చేయడంలో కొందరు అక్రమాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ప్రభుత్వ ఆశయానికి సహకరించాలని కోరారు. స్టాక్ వివరాలు పొంతన లేకపోవడంతో అంగన్వాడీ టీచర్ అనితకు మెమో ఇవ్వాలని సిడిపిఒ ఉమామహేశ్వరికి ఫోన్‌లో సూచించారు. అనంతరం ప్రజాపంపిణీ చేసే వాహనాన్ని పరిశీలించి అక్కడ సరుకులు ఎలా ఇస్తున్నారని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. సిఎస్‌డిటి వలీ, సూపర్‌వైజర్ రాగిణి, వసంత ఉన్నారు. **ఆస్పరి** కస్తూరిబా గాంధీ బాలిక పాఠశాలను ఎపి ఫుడ్ కమిషన్ ఛైర్మన్ ప్రతాప్ రెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచి చూశారు. భోజనాలు ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని బిణిగేరి గ్రామంలో రేషన్‌షాపు-4ను పరిశీలించి రిజిస్టర్‌ను చెక్ చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పత్తికొండ సివిల్ సప్లయి పాయింట్ నుంచి రేషన్ షాపులకు ఇస్తున్న 50 కిలోల బియ్యం బస్తాల్లో కిలో నుంచి రెండు కిలోల వరకు బియ్యం తక్కువగా వస్తున్నాయని డీలర్ సరస్వతి ఫుడ్ కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. పక్కనే ఉన్న సివిల్ సప్లయి డిపో మేనేజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రం-4 రికార్డులను తనిఖీ చేసి అంగన్వాడీ టీచర్ రాణితో మాట్లాడారు. చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఇస్తున్నారా లేదా అంటూ లబ్ధిదారులకు ఫోన్ చేసి విచారించారు. డిఇఒ రంగారెడ్డి, పత్తికొండ ఆర్‌డిఒ మోహన్ దాస్, తహశీల్దార్ కుమారస్వామి, పిఒ వేణుగోపాల్, జిసిడిఒ సునీత, సిడిపిఒ నిర్మలాదేవి, సూపర్‌వైజర్లు సునీత,

ఆస్పరిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి

వాలంటీర్లు లేకుండా ఇంటింటి సర్వే

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

వాలంటీర్ సహాయం లేకుండా ఇంటింటి సర్వే, ఓటరు జాబితా సవరణ చేపట్టాలని సబ్ కలెక్టర్, ఆదోని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక ఓటర్ల సవరణపై బూత్ లెవెల్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎటువంటి లోపాలకు తావివ్వ కుండా 2024 తుది ఓటర్ల జాబితాను రూపొందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాలంటీర్లు ఎన్నికలకు సంబంధించిన ఏవిధమైన పనుల్లోనూ పాల్గొనకుండా చర్యలు తీసుకోవాలని ఎఈఆర్‌ఒలకు సూచించారు. ఎఈఆర్‌ఒలు వారి సంబంధిత బూత్ స్థాయి అధికారులకు ఇంటింటి సర్వే, స్పెషల్ సమ్మరీ రివిజన్- 2024కి సంబంధించి శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. ఇంటింటి ఓటర్ల పరిశీలన చేస్తున్న సమయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎటువంటి అపోహలూ ఉండకుండా, అన్ని రకాల పార్టీలకు సంబంధించిన వారు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోమని సూచించాలని తెలిపారు. అలాగే బూత్ స్థాయి ఏజెంట్లను ఎంపిక చేసి జాబితాను ఎన్నికల అధికారి కార్యాలయానికి సమర్పించాలన్నారు. సంబంధిత పోలింగ్ కేంద్రాల్లోని మరణించిన వారి జాబితాను మరణ ధ్రువీకరణ పత్రం లేదా పంచనామ ద్వారా ధ్రువీకరించి, పరిశీలించిన తర్వాతే ఓటరు జాబితా నుంచి తీసివేయాలన్నారు. ఒకే ఇంట్లో ఎక్కువ మొత్తంలో ఓటర్లు ఉంటే ఆ ఇంటిని పరిశీలించి, ఆ ఇంట్లో ఎక్కువ మంది వేర్వేరుగా నివాసాలు ఉంటే ఎన్నికల ప్రధాన అధికారి వారి ఆదేశాల మేరకు వారికొక పద్ధతి ప్రకారం ఇంటి నెంబరు ఇవ్వాలన్నారు. ఒక ఇంటి నెంబర్‌లో ఉన్న ఓటర్లనందరినీ ఒకే పోలింగ్ బూత్‌లో చేర్చాలని తెలిపారు. తహశీల్దార్ వెంకటలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, డిప్యూటీ ఇంజినీర్ రాజు నాయక్ ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రభుత్వ కళాశాలల భవనాలు నిర్మించాలి

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరులోని ప్రభుత్వ డిగ్రీ, ఐటిఐ కళాశాలలకు నిధులు కేటాయించి భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు ఎస్.పోతురాజు, సహాయ కార్యదర్శి బి.పరమేష్ కోరారు. బుధవారం జ్యోతిబసు భవన్‌లో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు ఉలిరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆలూరులో ప్రభుత్వ డిగ్రీ, ఐటిఐ కళాశాలలకు ఏళ్లు గడుస్తున్నా సొంత భవనాలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. 1987 ఆలూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించినా భవన నిర్మాణం మధ్యలో ఆగిపోయిందన్నారు. సొంత భవనాలు లేకపోవడంతో ప్రభుత్వ బాయ్స్ హైస్కూల్-2 కొన్ని గదులను డిగ్రీ కళాశాలకు ఇవ్వడంతో డిగ్రీ విద్యార్థులు అందులోనే విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. 2008లో ప్రభుత్వ ఐటిఐ కళాశాలను ఏర్పాటు చేస్తే నేటి వరకు సొంత భవనాలు లేవన్నారు. ప్రభుత్వ బాయ్స్-1 హైస్కూల్‌లో పాత గదులను ఐటిఐ కళాశాలకు ఇవ్వడంతో అదే భవనంలోనే నేటి వరకు ఐటిఐ కళాశాల కొనసాగుతోందని తెలిపారు. అవి కూడా పురాతన భవనాలు కావడంతో భయం గుప్పెట్లో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. విద్యార్థి, యువజన సంఘాలు పోరాట ఉద్యమాలు చేస్తే 2019లో ఐటిఐ కళాశాలకు అగ్రహారం గ్రామ సమీపంలో స్థలం కేటాయించారని తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణం 75 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగతా 25 శాతం పూర్తి చేయడానికి నిధులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయని చెప్పారు. నిధులు విడుదల చేసి నిర్మాణం పూర్తి చేసి పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు గిరిమూర్తి, మండల నాయకులు మధు, రమేష్, హరికృష్ణ పాల్గొన్నారు.

మా పొలాన్ని, మా పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించండి

- పురుగు మందుతో మాజీ సర్పంచి దంపతుల నిరసన
- కార్యాలయం నుంచి జారుకున్న అధికారులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

తమ పొలాన్ని రెడ్ మార్క్ హోల్డ్‌లో నుంచి తొలగించి తమ పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పెద్దనేలటూరు మాజీ సర్పంచి చాకలి వీరన్న, ఆయన భార్య చాకలి శివలక్ష్మి కోరారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద పురుగు మందు డబ్బాతో బైఠాయించారు. కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది ఒక్కొక్కరుగా అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాధితుల వివరాల మేరకు... గ్రామంలో చాకలి వీరన్న తండ్రి చాకలి ఉళ్లక్కి పేరుతో 430 సర్వే నెంబర్‌లో రెండెకరాలు, చాకలి వీరన్న పేరుతో మూడెకరాలు, చాకలి శివపార్వతి పేరుతో నాలుగెకరాలు మొత్తం తొమ్మిది ఎకరాలు ఉంది. వాటికి ఖాతా నెంబర్లతో సహా పాస్ బుక్‌లు ఉన్నాయి. పొలం మొత్తం వీరి అనుభవంలోనే ఉంది. 2015లో వీరన్న తండ్రి పేరుతో ఉన్న రెండెకరాల భూమిని గ్రామానికి చెందిన వేరే వ్యక్తి తన పేరుపై ఆన్‌లైన్ మార్చుకొని తన భూమిని వేరే వాళ్లు ఆక్రమించుకుని అనుభవిస్తున్నారని కోర్టుకెళ్లారు. అప్పటి నుంచి రెండెకరాల పొలం వివాదంలో ఉంది. రెవెన్యూ అధికారులు 430 సర్వే నెంబర్‌లోని మొత్తం పొలాన్ని ఆన్‌లైన్ నుంచి తొలగించి హోల్డ్‌లో ఉంచడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదు. బ్యాంకుల్లో రుణాలు కూడా పొందలేక ఇబ్బందులకు గురవుతున్నామని బాధితులు తెలిపారు. వివాదంలో ఉన్న రెండెకరాలను మినహాయించి మిగతా ఏడెకరాలను హోల్డ్‌లో నుంచి తొలగించి తిరిగి యథావిధిగా తమ పేరుపై ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరన్న, ఆయన భార్య శివ పార్వతి, కుమారులు పురుగు మందు డబ్బాతో తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని అధికారులను నిలదీశారు. తమకు న్యాయం చేసే వరకు కదిలేది లేదని బైఠాయించారు. అధికారులు, సిబ్బంది సమాధానం ఇవ్వకుండా కార్యాలయం నుంచి వెళ్లిపోయారు. విషయం తెలిసి ఎఎస్ఐ తిమ్మారెడ్డి, పోలీసులు తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని బాధితులకు నచ్చజెప్పి కార్యాలయం నుంచి ఇంటికి పంపారు.

సర్ది చెబుతున్న ఎఎస్ఐ తిమ్మారెడ్డి



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న జిల్లా కలెక్టర్, జడ్పీ చైర్మన్ తదితరులు

168 ఏళ్ల బడి.. ఉపాధ్యాయులు కొరవడి..

- 16 మందికి గాను ఆరుగురే బోధన
- సాంఘిక, తెలుగు, పిఇటి, రెండు ఎస్‌జిటి పోస్టులు ఖాళీ - బదిలీల్లోనూ కేటాయించని అధికారులు
- చందాలతో ఇద్దరు వాలంటీర్ల నియామకం - తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

ప్రజాశక్తి - చాగలమర్రి

రాష్ట్రంలో ప్రభుత్వ బడులను ప్రగతి మార్గం పట్టిస్తామంటున్న ముఖ్యమంత్రి మాటల్లో డొల్లతనం క్షేత్రస్థాయిలో తేటతెల్లమవుతుంది. చారిత్రక నేపథ్యమున్న బడులపైనా ప్రభుత్వం శీతకన్నేసింది. అందుకు ఉదాహరణగా నిలుస్తోంది చాగలమర్రి మండలంలోని ముత్యాలపాడు ఎస్పీజీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల. 1855లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో స్థాపించిన మొదటి పాఠశాల. డెండీ షప్పర్డ్ దొర ఈ బడిని ఏర్పాటు చేసి చుట్టుపక్కల గ్రామాల్లోని ఎందరో పేద విద్యార్థులను తీర్చిదిద్దారు. అనంతరం ఇది ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలగా మారింది. ఇంతటి చరిత్ర కలిగిన బడి ప్రస్తుతం సమస్యల సుడిలో చిక్కుకుంది. పాఠశాలలోని 248 మంది విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు 16 మంది ఉపాధ్యాయులు ఉండాలి. కానీ ప్రస్తుతం ఆరుగురు ఉపాధ్యాయులే విధులు నిర్వహిస్తున్నారు. రెండేళ్లగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీలలోనూ ఇక్కడికి ఎవరినీ కేటాయించలేదు. సాంఘిక శాస్త్రం, తెలుగు బోధకులు, పీఈటీ, రెండు ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉపాధ్యాయులే తలా కొంత చందాలు వేసుకుని ఇద్దరు వాలంటీర్లను ఏర్పాటు చేసుకున్నారు. వారికి నెలకు రూ.7 వేలు ఇస్తూ పాఠశాలను నడిపిస్తున్నారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా గతంతో 500 మంది దాకా విద్యార్థులున్న బడిలో ప్రస్తుతం సగానికి సగం తగ్గిపోయారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే 168 ఏళ్ల నాటి ఈ బడి మూతబడే ప్రమాదముంది. ప్రభుత్వం తమ పాఠశాల సమస్యపై దృష్టి సారించి పరిష్కరించాలని ప్రధానోపాధ్యాయురాలు ప్రియ దర్శిని, ముత్యాలపాడు గ్రామస్తులు కోరుతున్నారు.

ముత్యాలపాడు ఎస్‌పిజి ఎయిడెడ్ ఉన్నత పాఠశాల

పేద జంటల జీవితాల్లో వెలుగులు

- వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా మంజూరు
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నూతనంగా వివాహం చేసుకున్న పేద జంటల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల కింద మూడో అర్హులైన వారికి నగదు జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ తెలిపారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వివాహం చేసుకున్న 18,883 మంది అర్హులైన జంటలకు 141.60 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ కారక్రమాన్ని నంద్యాల కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మార్కెట్ ఛైర్మన్ పిపి నాగిరెడ్డి, మైనార్టీ ప్రభుత్వ సలహా దారుడు హబీబుల్లా, ఎపిఎస్పిడిసిఎల్ డైరెక్టర్ శశికళా రెడ్డి, హస్త కళల డైరెక్టర్ సునీత అమృత రాజ్, ఎపి స్టేట్ ఇరిగేషన్ చైర్ పర్సన్ గిరిజ, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, సంక్షేమ శాఖ డిడి చింతామణి, లబ్ధిదారులు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మూడవ విడతలో అర్హులైన 982 మంది జంటలకు 8,35,95,000 రూపాయలు జమ చేశామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ చైర్మన్, మార్కెట్ చైర్మన్ తదితరుల చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కును అందజేశారు.

కలెక్టర్‌తో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

పోతిరెడ్డిపాడు నుండి నీళ్లు వదలాలి

- ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలోని తాగు, సాగు నీరు అవసరాలను దృష్టిలో ఉంచుకొని తక్షణమే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా జిల్లాలోని జలాశయాలకు అన్ని కాలువలకు నీళ్ల వదలాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడులు డిమాండ్ చేశారు. బుధవారం ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టు నీటిమట్టం నేటికి 863 అడుగులకు చేరుకుందని, నీటి వనరుల చట్టం ప్రకారం శ్రీశైలం నీటిమట్టం 854 అడుగులకు చేరిన వెంటనే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీళ్ల వదలాల్సి ఉందన్నారు. కానీ ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా 863 అడుగులకు చేరినా నీళ్ల వదలకపోవటం వల్ల జిల్లాలో ఇప్పటికే వేసిన పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఎమ్మెల్యేలు, రాష్ట్ర మంత్రులు, సాగునీటి ప్రాజెక్టుల ఉన్నత స్థాయి అధికారులు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు, జిల్లా కలెక్టర్‌తతో జరిగిన నీటి పారుదుల సలహా మండలి బోర్డు సమావేశంలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటి విడుదలపైత స్పష్టమైన ప్రకటన చేయకపోవడం బాధాకరమన్నారు. నీళ్ల వదిలే తేదీ నిర్ణయించకపోవడం విచారకరమన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఖరీఫ్‌లో వేసిన పంటలు ఎండిపోతున్నాయని, రైతాంగం తీవ్రంగా నష్టపోతారని కలెక్టర్‌కు వివరించారు. శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి 875 అడుగులు తర్వాతనే చేయాలని నిబంధన ఉన్నా ఇప్పుడే విద్యుత్ ఉత్పత్తి చేస్తూ తెలంగాణ బోర్డు ఉన్న నీటిని కిందికి వదులుతున్నారని, ఫలితంగా రాయలసీమ ప్రజల గొంతు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా ప్రజల అవసరాలు, తాగు, సాగు నీటి కొరకు కలెక్టర్ జోక్యం చేసుకొని తక్షణమే శ్రీశైలం జలాలను పోతిరెడ్డిపాడు ద్వారా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు సురేష్, సుధాకర్, ప్రసాద్, శ్రీనివాసరెడ్డి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మార్క్ తదితరులు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో

బిజెపిని, మోడీని దేశం నుండి తరిమివేయాలి

- రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి
- జిల్లా వ్యాప్తంగా కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - నంద్యాల

దేశం నుండి బిజెపిని, ప్రధాని మోడీని తరిమివేయాలని, క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, మహిళలు, ఉద్యోగులు కలిసి రావాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. 'మోడీ నుండి దేశాన్ని రక్షించుకుందాం' పిలుపుతో మోడీని దేశం నుంచి తరిమికొడదామంటూ బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్ని కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. నంద్యాల పట్టణంలో పద్మావతి నగర్ ఆర్చ్ నుండి బిఎస్ఎన్ఎల్ కార్యాలయం మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు కార్మికులు, రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి (మిగతా 6వ పేజీలో..)

నంద్యాలలో చేపట్టిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్న అన్ని కార్మిక, కర్షక సంఘాల నాయకులు, మహిళలు

బేతంచెర్లలో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు, మహిళలు

గరిష్ట స్థాయికి చేరువలో నీటిమట్టం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

కృష్ణా ఎగువ పరివాహక ప్రాంతాల నుండి నీటి ప్రవాహం కొనసాగుతుండడంతో శ్రీశైలం జలాశయ నీటిమట్టం గరిష్ట స్థాయి చేరువలో ఉంది. బుధవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి 864.30 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు. ఎగువ జూరాల నుండి 46,508 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నాయి. నీటి నిలువ సామర్థ్యం 120.0754 టీఎంసీలుగా నమోదయింది. తెలంగాణ పరిధిలో ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్తు కేంద్రంలో గడచిన 24 గంటల్లో 1363 క్యూసెక్కుల నీటితో 6.974 మిలియన్ యూనిట్లు ఉత్పత్తిని చేశారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడిగట్టు జల విద్యుత్తు కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని, బ్యాక్ వాటర్ నుండి ఇంకా నీటిని విడుదల చేయలేదు. మరో రెండు మూడు రోజులలో బ్యాక్ వాటర్ నుండి రాయలసీమకు తాగు, సాగు నీరు అవసరం కోసం నీటిని విడుదల చేసే అవకాశం ఉంది.

జాతీయ జెండాను జిల్లా ఎస్పీకి అందజేస్తున్న తపాలా అధికారులు

పోస్టాఫీస్‌లలో జాతీయ జెండాలు : ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నేటి నుండి పోస్టాఫీసులలో త్రివర్ణ పతాకాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచుతుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ కె రఘువీర్ రెడ్డి తెలిపారు. బుధవారం నంద్యాల తపాలా డివిజన్ సూపరింటెండెంట్ పార్వతి, ఎస్.శ్రీనివాస రెడ్డి, మార్కెటింగ్ ఎగ్జిక్యూటర్ వి.వెంకటేశ్వర్ రెడ్డిలు జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి జాతీయ జెండాను అందజేశారు. ఈ సంధర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారతదేశ 76వ స్వాతంత్ర దినోత్సవ వేడుల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం హర్ ఘర్ తిరంగా 2.0 ప్రచార కార్యక్రమంలో భాగంగా పోస్టాఫీసుల్లో త్రివర్ణ పతాకాలను ఈ నెల 10 నుండి 15వ తేదీ వరకు అందుబాటులో ఉంచనుందన్నారు. రూ.25లకు జాతీయ జెండాలను అందించ నున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలని కోరారు.

శ్రీశైలంలో కొనసాగుతున్న ఎసిబి తనిఖీలు

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీశైల దేవస్థానం పరిధిలో జరిగిన ఇంజనీరింగ్ పనులపై ఎసిబి అధికారులు రెండు రోజుల నుండి తనిఖీలు నిర్వహిస్తున్నారు. దేవస్థానం ఖర్చు చేసిన కోట్ల రూపాయల పనులలో అవకతవకలు జరిగాయని ఫిర్యాదులు అందడంతో ఏసీబీ సిఐ వంశనాథన్ ఆధ్వర్యంలో ఏడు మంది బృందంతో తనిఖీలు కొనసాగుతున్నాయి. మంగళవారం నుండి జరిగిన పనులలో శాంపిల్‌గా మెటీరియల్ సేకరించి నాణ్యత ప్రమాణాలను బుధవారం పరిశీలించారు. సేకరించిన మెటీరియల్ ల్యాబ్‌కు పంపిస్తామని సిఐ తెలిపారు. ఎం బుక్కులను పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులతో పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీశైల దేవస్థానం ఇంజనీరింగ్ విభాగంలో ఇద్దరు ఒప్పంద ఏఈలపైనే కీలక సమాచారంతో మరోసారి ఏసీబీ అధికారులు ఆడిట్ విభాగం ద్వారానే వివరాలను తెలుసుకున్నట్లుగా సమాచారం.

శ్రావణమాసానికి విస్తృత ఏర్పాట్లు : ఇఒ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రావణమాసంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని విస్తృత ఏర్పాట్లను చేస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న తెలిపారు. భక్తుల సౌకర్యం కోసం దేవస్థానం చేస్తున్న ఏర్పాట్లలో భాగంగా బుధవారం పలు రకాల ఏర్పాట్లను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. లడ్డు ప్రసాదాల విక్రయ కేంద్రాలు, అన్న ప్రసాద వితరణ, పార్కింగ్ ప్రదేశాలు, శివగంగ జల ప్రసాదాల ప్లాంట్లను పరిశీలించారు. కార్యక్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరిస్తాం

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలోని అన్ని గూడెలలోని గిరిజనుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని వైయస్సార్ సెంటినరీ హాలులో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో శ్రీశైలంలో భారత రాష్ట్రపతి గిరిజనులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కార దిశలో చర్యలు తీసుకున్నారన్నారు. అలాగే నెరవాడ ట్రైబల్ రెసిడెన్షియల్ స్కూల్లో కూడా రాష్ట్ర గవర్నర్ చెంచు విద్యార్థులతో ముచ్చటించి వారి బాగోగులు తీసుకొని చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారన్నారు. షెడ్యూల్ తెగల ప్రజల అభివృద్ధికి జిల్లాలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. షెడ్యూల్ తెగల ప్రజలకు ఆసక్తి ఉన్న రంగాలలో స్కిల్ డెవలప్మెంట్ ద్వారా శిక్షణ నిప్పించి స్వయం ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజనులు ఎంత బాగా చదివితే భవిష్యత్తు అంత బాగా మారుతుందన్నారు. అనంతరం వివిధ సంఘాల గిరిజన నాయకులు వివిధ అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు జిల్లా కలెక్టరును శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ కె. బాలా నాయక్, గిరిజన ప్రజా సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు కె. రాజు నాయక్, ప్రధాన కార్యదర్శి కే రవి నాయక్, వివిధ సంఘాల నాయకులు విక్రమ్ సింహ నాయక్, శంకర్ నాయక్, స్వామినాయక్, రవీంద్రనాయక్, జవహర్ నాయక్, శ్రీను నాయక్, గోపాల్, అశోక్ నాయక్, రామచంద్రుడు, సలోమీ, ఈశ్వర్, నారాయణమ్మ, నరసింహారావు, తోటరాముడు, రామ్ బాలాజీ నాయక్, డిఆర్ఓ పుల్లయ్య జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జగన్నాధ రావు, ఎటిడబ్ల్యుఓ హుస్సేనయ్య తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు మెమోంటోలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్

రానున్న ఎన్నికల్లో టిడిపి జెండా ఎగరేస్తాం

- మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆళ్లగడ్డలో టిడిపి జెండా ఎగరవేస్తామని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం సిరివెళ్లకు వచ్చిన మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, భార్గవ్ రామ్ నాయుడు, భూమా జగత్ విఖ్యాత రెడ్డిలకు ఉల్లి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. పెద్దమ్మ గుడి సమీపంలో గల కాంప్లెక్స్‌లోని ఉల్లి వెంకటసుబ్బయ్య కార్యాలయంలో టిడిపిలో చేరిన ఉల్లి వెంకటసుబ్బయ్యకు, ఇతర యువ నేతలకు మాజీ మంత్రి అఖిలప్రియ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాజీమంత్రి భూమా అఖిలప్రియ, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మల్లెల రాజశేఖర్‌లు ఉల్లి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ టిడిపి నాయకులు, కార్యకర్తలు అంతా ఏకమై పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే వైసిపి ప్రభుత్వం కేసులు పెట్టి వేధిస్తున్నదని, అటువంటి ప్రభుత్వానికి ఓటు అనే ఆయుధంతో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. అనంతరం ఉల్లి వెంకటసుబ్బయ్య నివాసానికి చేరుకొని ఆయన తండ్రి ఉల్లి గుర్రప్పను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే బిసి నేత పిపి లింగమయ్య గృహానికి చేరుకొని ఆయన సతీమణిని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి యామా గుర్రప్ప, మాజీ ఎంపీటీసీ గంతీ తానేష, ఎంపీటీసీ యామా శ్రీనివాసులు, పసుల రామకృష్ణ, శీలం లక్ష్మి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భూమా అఖిలప్రియ

జిఎన్‌హెచ్‌ఎస్ కాల్వ లైనింగ్ పనుల్లో భారీ అవినీతి

- కమీషన్ల కోసమే నాసిరకం పనులు : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

గాలేరు నగరి సృజల స్రవంతి కాల్వకు లైనింగ్ వేయడం వల్ల భూగర్భ జలాలు ఇంకిపోయి ఈ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని యనకండ్ల గ్రామ సమీపంలో గాలేరు నగరి సృజల స్రవంతి కాల్వ లైనింగ్ పనులను, లైనింగ్ దెబ్బతిన్న ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఎన్ఎస్ఎస్ కాల్వకు లైనింగ్ అవసరం లేకపోయినా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కమీషన్ల కోసం లైనింగ్ పనులు చేశారని విమర్శించారు. పనులు నాసిరకంగా చేయడంతో సంవత్సరం గడవకముందే దెబ్బతింటుందని తెలిపారు. జీఎన్ఎస్ఎస్ కాల్వకు లైనింగ్ వేయకముందు 50 అడుగుల్లో భూగర్భ జలాలు ఉండేవని, లైనింగ్ వేసిన తర్వాత 200 అడుగులకు పైగా భూగర్భ జలాలు ఇంకిపోయాయని అన్నారు. జీఎన్ఎస్ఎస్ కాల్వ వల్ల ఒక్క కడప జిల్లాకు మాత్రమే ఉపయోగమన్నారు. అధికార పార్టీ నాయకుల బెదిరింపులకు భయపడేది లేదని, ప్రభుత్వ వ్యతిరేక విధానాలను సమర్ధవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు యువత పార్లమెంటు అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణా నాయక్, బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం భూషన్న, నాయకులు ఎర్రగుడి భాస్కర్ రెడ్డి, లాయర్ నాగేంద్ర రెడ్డి, సాదుల మహేశ్వరరెడ్డి, బొబ్బల మదన గోపాల్ రెడ్డి, చంద్రారెడ్డి, పెండేకంటి నాగసుబ్బయ్య యాదవ్ హుస్సేనాపురం జాంగిర్, పసుపల బాల నాయుడు, చిన్న రాజుపాలెం నరసింహ, రామకృష్ణాపురం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

లైనింగ్ దెబ్బతిన్న ప్రాంతంలో సెల్ఫీ తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే

విజేతలైన విద్యార్థులను అభినందిస్తున్న షేక్షావలి రెడ్డి

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు 'గురురాజా' విద్యార్థులు

ప్రజాశక్తి - నంద్యాల : ఈనెల 6న ఎస్పీజీ స్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఫుట్బాల్ ఎంపిక పోటీల్లో చక్కని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు గురు రాజా స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు గురు రాజ స్కూల్ విద్యాసంస్థ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ క్రీడాకారులు కడప జిల్లాలో సెప్టెంబర్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం విజేతలైన క్రీడాకారులను మెడల్స్‌తో అభినందించారు. నంద్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఫుట్బాల్ క్రీడకు ప్రాతినిధ్యం వహిస్తున్న పీఈటీ డిపి.రాజును అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు : చైర్మన్

ప్రజాశక్తి - ఆత్మకూరు : గర్భవతులకు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైసిపి ప్రభుత్వం ముందుంటుందని ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఎ రషీద్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ప్రతి నెల 9న జరిగే గర్భవతుల స్కానింగ్ కేంద్రాన్ని తప్ప తనిఖీ చేస్తామన్నారు. కోఆప్షన్ సభ్యులు ఎంఎ రషీద్ మాట్లాడుతూ వైద్యశాలకు వచ్చే ప్రజలకు డాక్టర్లు మంచి సేవలు అందించినప్పుడే వైసీపీ ప్రభుత్వానికి ప్రత్యేక గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య అధికారులు డాక్టర్ వెంకట రమణ, డాక్టర్ రాయుడు, మున్సిపల్ ఇంచార్జి మేనేజర్ వెంకటేశ్వర గౌడ్, హెడ్ సిస్టర్ వసంత, సిబ్బంది పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - బేతంచర్ల : బేతంచెర్లలోని హనుమాన్ నగర్ కాలనీ వాసి లారీ డ్రైవర్ గొల్ల సోమశేఖర్ (30) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య శైలజ, కూతురు వర్షిని (6) ఉన్నారు. కుటుంబ యజమాని అకస్మాత్తుగా మరణించడంతో భార్య, బంధువుల రోదనలు మిన్నంటాయి.

కస్తూరిబా పాఠశాలకు సెలవులు ప్రకటించాలి : పిడిఎస్‌యు

ప్రజాశక్తి - పగిడ్యాల : కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలోని విద్యార్థినిలు కండ్ల కలకతో అనారోగ్యం బారిన పడ్డారని, పాఠశాలకు ఐదు రోజుల వరకు సెలవు ప్రకటించాలని పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు మద్రిస్వామి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం పగిడ్యాల ఎంఆర్సి భవనంలో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ఎంఈఓ సుభాన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కస్తూరిబా బాలికల విద్యాలయంలో దాదాపు 45 మందికి కండ్ల కలకతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థినిల పట్ల నిర్లక్ష్యంగా వహిస్తున్న ప్రిన్సిపల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులు మస్తాన్, సంతోష్, రాజు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ బీమా తక్షణసాయం అందజేత

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : మండలంలో బెలుం గ్రామంలో నేగల సూరిబాబు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందడంతో వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ. 10 వేలు ఆర్థిక సాయం బుధవారం పంచాయతీ సెక్రెటరీ నరేష్ అందజేశారు. కార్యక్రమంలో పర్వేజ్, వెల్ఫేర్ అసిస్టెంట్ లావణ్య దేవి, వాలంటీర్ పెరుమాల్ల రవి తదితరులు పాల్గొన్నారు

హెల్త్ క్లినిక్ సెంటర్‌ను డిఎంహెచ్‌ఒ తనిఖీ

ప్రజాశక్తి - నంద్యాల రూరల్ : బండి ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బిల్లాలాపురం గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డా.ఆర్.వెంకటరమణ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కాంతారావ్ నాయక్, వైద్యాధికారి, ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎం శాంత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటిపై జాతీయ జెండాను ఎగరవేయండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ఆజాదికా అమృత్ మహోత్సవ్ ముగింపు ఉత్సవాల సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగరవేయాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్వగృహంలో మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలందరూ జాతీయ జెండా ఎగరవేయాలని కోరారు. అనంతరం పోస్టల్ ఇన్స్పెక్టర్ మౌళీశ్వరరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ రవి చంద్ర రెడ్డి, భాస్కర్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి : ఎంపిడిఒ

- గ్రీన్ అంబాసిడర్‌ల వేతనాలు ఇవ్వలేమని సర్వసభ్య సమావేశంలో సర్పంచులు వినతి అందజేత

ప్రజాశక్తి - పాములపాడు

సర్పంచులు, ఎంపీటీసీ, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని ఎంపీడీవో గోపికృష్ణ కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సరోజినీ వర్జినీయ అధ్యక్షతన సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, ఆయా శాఖల మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. డాక్టర్ ఈవి నాగలక్ష్మి దేవి మాట్లాడుతూ ఈనెల 10న అన్ని పాఠశాలలో ఆల్బెండజోల్ టాబ్లెట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఏఈఓ మద్దిలేటి మాట్లాడుతూ రైతులకు ఆర్బికే కేంద్రాలలో ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. ఎంఈఓ బాలాజీ నాయక్ మాట్లాడుతూ అన్ని స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం చేర్చినట్లు తెలిపారు. అడిషనల్ సిడిపిఓ మంగవల్లి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు బాలింతలకు పౌష్టిక ఆహారాన్ని ఇంటికి ఇస్తున్నట్లు చెప్పారు. పశువైద్యాధికారి అనిల్ మాట్లాడుతూ పశువులకు గడ్డి, దానా రైతులకు రాయితీతో ఇస్తున్నామన్నారు. ఏపీవో విమలమ్మ మాట్లాడుతూ మాభూమి నామట్టి కార్యక్రమాన్ని గ్రామాలలో చేస్తున్నట్లు తెలిపారు. ఏపీఎం అనురాధ మాట్లాడుతూ మండలంలో ఆరో విడత 520 మందికి జగనన్న తోడు వచ్చిందన్నారు. ఈవోఆర్డి శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ 2023-24కి 15వ ఆర్థిక సంఘం నిధులు మండలానికి 45,66,000 వచ్చినట్లు తెలిపారు.

సర్పంచులు లేవనెత్తిన సమస్యలు : రుద్రవరం సర్పంచ్ రామస్వామి మాట్లాడుతూ సిసి రోడ్డు వేసి రెండు నెలలైనా బిల్లు రాలేదని తెలిపారు. ఇస్కాల సర్పంచ్ మౌలాలి మాట్లాడుతూ గ్రామంలో మరో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించాలన్నార. వాడాల సర్పంచ్ లత మాట్లాడుతూ మా గ్రామానికి పారుమంచాల నుండి వచ్చే కరెంట్ కనెక్షన్ తప్పించి మద్దూర్ నుండి ఇవ్వాలని కోరారు. సర్పంచులు అందరూ ఉమ్మడిగా 15 వ ఆర్థిక సంఘం నిధులలో గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు ఇవ్వలేమని ఎంపీడీవో, ఎంపీపీలకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు కొండ వరలక్ష్మి, సర్పంచులు నాయని సావిత్రమ్మ, మాణిక్యమ్మ, మేకల భాగ్యమ్మ, మంగమ్మ బాయ్, చంద్రారెడ్డి ఎంపిటిసిలు సురేష్, దుర్గాబాయి, బషీర్ అహ్మద్, ముర్తుజాబి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్‌ల వేతనాలు ఇవ్వలేమని వినతి అందజేస్తున్న సర్పంచులు

యువత దేశాభివృద్ధికి పాటుపడాలి

ప్రజాశక్తి - పాణ్యం

యువత దేశాభివృద్ధికి పాటుపడాలని రిటైర్డ్ సైనికుల సంక్షేమ సంఘం సెక్రటరీ చంద్రమౌళీశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక శాంతిరాం ఫార్మసీ కళాశాలలో స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా మేరా మట్టి-మేరా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, విద్యార్థులు పాల్గొన్నారు. **పగిడ్యాల :** మండలంలోని కొత్త ముచ్చుమర్రి గ్రామంలో బుధవారం నా భూమి నా దేశం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కాటం రాధమ్మ త్రివర్ణ పతాకం ఎగరవేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీరులకు వందనం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఈఓఆర్డి నాగేంద్రయ్య, పిఆర్ఏఈ వెంకటేశ్వర్లు, ఏపీవో మద్దిలేటి, కార్యదర్శి జావిద్, గ్రామ పెద్దలు. కాటం రమేష్ రెడ్డి, మద్దిలేటి, టెక్నికల్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **రుద్రవరం :** మండల పరిధిలోని ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నా భూమి నా దేశం నేల తల్లికి నమస్కారం వీరులకు వందనం కార్యక్రమాన్ని బుధవారం ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్సార్ నాయకులు అధికారులు ప్రతిజ్ఞ చేశారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ అమర్నాథ్ రెడ్డి, కార్యదర్శి పాములేటి, సర్పంచ్ పాణ్యం లక్ష్మీదేవి, ఉపాధి హామీ ఏపీవో ప్రతాప్, ఇన్చార్జి ఈసి సుబ్బన్న, అధికారులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** గ్రామాల్లో ఉన్న ప్రజలు మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ విధిగా పెట్టుకోవాలని నాటిన మొక్కలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది అని ఎంపీడీవో మేరీ తెలిపారు. మండలంలోని నందికుంట గ్రామంలో నా మట్టి నా దేశం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. గ్రామ సచివాలయం వద్ద నా మట్టి నా దేశం ప్రతిజ్ఞ శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఏపీవో రేష్మ, ఏపీఎం పుల్లయ్య, ఈసీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వీఆర్వో కృష్ణారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ కిరణ్ కుమార్, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ మురళి, ఎఫ్ టి బి లింగస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ స్వాములు, తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని ఇంచార్జ్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కౌసల్య దేవి ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు. డాక్టర్ రామకృష్ణ, రవి కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇటాచితో ట్రాక్టర్లోకి ఎర్రమట్టి వేస్తున్న దృశ్యం

మంత్రి ఇలాఖాలో బరితెగించిన కాంట్రాక్టర్లు

- యథేచ్ఛగా ఎర్రమట్టి తవ్వకాలు

- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - ప్యాపిలి

అభివృద్ధి పనుల పేరుతో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఇలాఖాలో కాంట్రాక్టర్లు బరి తెగించి యథేచ్ఛగా ఎర్రమట్టి అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. మండల కేంద్రం ప్యాపిలితో పాటు హుసేనాపురం, మెట్టుపల్లి, పిఆర్ పల్లి, వెంగళంపల్లి, రాచర్ల, గుడిపాడు, ఏనుగుమర్రి, తదితర గ్రామాల్లో ఖనిజ సంపదను అక్రమంగా తరలిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. అభివృద్ధి పనుల పేరిట మంత్రి ఇలాకాలో కాంట్రాక్టర్లు అనుమతులు ఉన్నాయంటూ యదేచ్ఛగా ఎర్ర మట్టిని తరలిస్తున్నారు. మొన్న వానకొండ, నేడు డంపింగ్ యార్డ్ పక్కన యదేచ్ఛగా ఎర్ర మట్టి తవ్వకాలు జరిపి పట్టపగలే హిటాచితో ట్రాక్టర్లతో ఎర్ర మట్టిని తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడం పట్ల మామూళ్ల మత్తులో ఉందా అని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎర్రమట్టి అక్రమ తవ్వకాలపై మైండ్స్ అండ్ జువాలజీ అధికారి రాజగోపాల్‌ను వివరణ కోరగా తమ శాఖ నుండి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే స్థానిక తహసిల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఈవో శివకుమార్ గౌడ్‌లను వివరణ కోరగా తమ శాఖలకు ఎటువంటి సంబంధం లేదన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని మారుతి నగర్ ఎబినేజర్ చర్చిలో బుధవారం ఇండియా క్యాంపస్ క్రూసెడ్ ఫర్ క్రైస్ట్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పాస్టర్ జాకబ్ స్వచ్ఛంద సంస్థల ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం అనుభవజ్ఞులైన వైద్యులు ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి వారికి కావాల్సిన మందులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లాలు ప్రసాద్, ఆర్‌టిసి బాబు, ఉస్మాన్ బేగ్, అబ్దుల్ రవూఫ్, వైసిపి నాయకులు మధుసూదన్ రెడ్డి, ముచ్చుమర్రి భాష, డి.రమేష్, చరణ్ తేజ పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వానికి అభివృద్ధిపై శ్రద్ధ లేదు

- శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - మహానంది

వైసిపి ప్రభుత్వం వారికి కేసుల మీద ఉన్న శ్రద్ధ అభివృద్ధి వైపు లేదని,టిడిపి హయాంలోనే అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహానంది సమీపంలోని పాలేరు వాగు వంతెన నిర్మాణాన్ని, మహానంది వ్యవసాయ కళాశాల రోడ్డును పరిశీలించి ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ మహానంది-బోయిలకుంట్ల రోడ్డు నిర్మాణ కోసం తెలుగుదేశం ప్రభుత్వం రూ. 13 కోట్లు ఖర్చు చేసిందని, కానీ ప్రభుత్వం మారడంతో వ్యవసాయ కళాశాల నుండి మహానంది వరకు దాదాపు 3 కిలోమీటర్లు మధ్యలో ఆగిపోయిందన్నారు. గుంతల రోడ్లకు ఎలాంటి మరమ్మతులు జరగలేదని తెలిపారు. రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం విడ్డూరమన్నారు. గాజులపల్లె షాదీఖానా నిర్మాణం గత ప్రభుత్వ హయాంలో బీజం పడినా నేటికి కూడా నిధులు కేటాయించి పూర్తి చేయకపోవడం విడ్డూరమన్నారు. ఈ కార్యక్రమానికి ముందు మహానంది క్షేత్రంలో స్వామి అమ్మవార్లను ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు స్థానిక ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి మాత్రం స్వాగత కార్యక్రమాల్లో పాల్గొనలేదని టిడిపి వర్గాలు ఆరోపిస్తున్నాయి. కొన్ని అనివార్య కారణాలతో రాలేదని, విచారణలో భాగంగా కోర్టు కేసులకు సంబంధించి బిజీగా ఉన్నందున రాలేకపోయినట్లు మీడియాకు ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ బాధ్యుడు బన్నూరు రామలింగారెడ్డి, తమ్మడపల్లె జనార్దన్ రెడ్డి, మహానంది మాజీ దేవస్థానం చైర్మన్ పాణ్యం ప్రసాదరావు, గాజులపల్లి ఆర్ఎస్ సర్పంచ్ అస్లాం భాష, శీను, శివ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగిపోయిన షాది ఖానాను చూపిస్తూ చాలెంజ్ విసురుతున్న మాజీ ఎమ్మెల్యే

కళాకారులను ఆదుకోవాలి : పిఎన్ఎం

ప్రజాశక్తి - ఆత్మకూర్

జానపద కళాకారులను, ప్రజా కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ కోయలకొండ నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు జోసెఫ్ శేఖర్, డాల్ వెంకటేశ్వర్లు, మాహబూబ్ బాష డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కళలను పూర్తిగా విస్మరిస్తుందని అన్నారు. సాంస్కృతిక శాఖ వలన కళాకారులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. కళాకారులకు గత ప్రభుత్వం ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అంత్యోదయ బియ్యం కార్డ్స్, ఆర్టీసీ బస్సులల్లో టికెట్‌లో రాయితీ, ఇంటి స్థలంతోపాటు పక్కా గృహం నిర్మించి ఇవ్వాలని, పెన్షన్‌ను 3 వేల నుండి 5 వేలకు పెంచాలని, ప్రతి మండల కేంద్రంలో ఆడిటోరియంలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ నెల 12, 13, 14వ తేదీలలో నంద్యాల జిల్లా కేంద్రంలోని తెలకపల్లి నరసింహయ్య భవన్‌లో జిల్లా స్థాయి పాటలు, డాన్స్, కోలాటం, నాటిక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, ముఖ్య అతిథుగా పిఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి ఎ.అనిల్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇ.రాజు హాజరవుతారని తెలిపారు. 14న ఉదయం 10:30 గంటలకు శిక్షణ పొందిన కళాకారులచే స్వాతంత్ర జాగారణ పేరుతో ప్రదర్శన ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న నాగరాజు

అభివృద్ధికి ఆమడదూరం బిసి కాలనీ

- దశాబ్దాలుగా లేని సిసి రోడ్లు, డ్రెయినేజీలు
- ఇబ్బందుల్లో ప్రజలు - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని జి.లింగాపురం గ్రామంలోని బిసి కాలనీ అభివృద్ధికి నోచుకోక దశాబ్దాల నుండి కాలనీవాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో వందలాది కుటుంబాలు నివసిస్తున్నా అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో మురికి కూపంలా మారి రోగాలకు నిలయమవుతోంది. మురుగునీటిలో దోమలు వృద్ధి చెంది కాలనీ వాసులపై దాడి చేస్తున్నాయి. కాలనీ వాసులు రోగాల బారిన పడుతున్న పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఇటీవల జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానిక మహిళలు, కాలనీ పెద్దలు విన్నవించారు. అయినా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు కాలనీ అభివృద్ధిపై దృష్టి సారించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

లింగాపురం గ్రామంలో బురదమంగా ఉన్న బిసి కాలనీ దారి

మురుగు దుర్వాసన భరించలేకపోతున్నాం
బాల వెంకట్ రెడ్డి, బిసి కాలనీ, లింగాపురం గ్రామం

బిసి కాలనీలో దాదాపు 200 కుటుంబాలు జీవనం చేస్తున్నాయి. దశాబ్దాల కాలం నుండి ఈ కాలనీలో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు లేవు. కాలనీలో మురుగునీటి దుర్వాసనతో దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నాం. వర్షాకాలంలో టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ లాంటి వ్యాధుల బారిన పడుతున్నాం. కాలనీకి అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు విఫలమయ్యారు.

అభివృద్ధి చేయడంలో అధికారులు విఫలం
- నడిపి వన్నూరు సా, బిసి కాలనీ వాసి, లింగాపురం.

బిసి కాలనీని అభివృద్ధి చేయడంలో అధికారులు, రాజకీయ నాయకులు విఫలమయ్యారు. సమస్యల నడుమ జీవిస్తున్నాం. బిసి కాలనీ అభివృద్ధికి అధికారులు, రాజకీయ నాయకులు కృషి చేయాలి.

వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలి : బిసి ఇందిర

ప్రజాశక్తి - సంజామల

వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని కమలాపురి గ్రామంలో ఆమె పర్యటించారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆమె ప్రతి ఇంటికి వెళుతూ మినీ మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి, చంద్రశేఖర్ రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బిసి ఇందిరమ్మ

అన్ని విధాలా నియోజకవర్గం అభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాణ్యం : పాణ్యం నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నామని పాణ్యం శాసన సభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు చేస్తున్న యుద్ధభేరి ప్రాజెక్టులపై కాదని, గుర్తింపు కోసం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గోరుకల్లు జలాశయంకు చంద్ర బాబు చేసింది ఏమీలేదన్నారు. కార్యక్రమంలో ఎంపిపి హుస్సేన్ బీ, సర్పంచ్ పల్లవి, వైసిపి మండల నాయకులు సూర్య నారాయణ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, చందమామ బాబు, పాలం చంద్ర శేఖర్ రెడ్డి, జాకీర్ హుస్సేన్, మద్దూరు సర్పంచ్ ప్రదీప్ కుమార్ రెడ్డి, తమ్మరాజుపల్లే సర్పంచి విజయ గౌరి, శేశా రెడ్డి, తహశీల్దార్ మల్లికార్జున రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనురాధ, మండల ఇంజనీర్ బాషా, సి.వెంకటేశ్వర రావు, యస్ఐ అశోక్ పాల్గొన్నారు.

ORDER 1 RULE 10 నోటీసు ప్రకటన
మహారాజశ్రీ నంద్యాల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
I.A. No. 2142/2022 IN O.S. No. 517/2019

కంబాల చిన్న శంకరయ్య ... అర్జీదారు/ వాది
-VS-
1) కంబాల శివమ్మ వగైరా
3) శివరామ కన్స్ట్రక్షన్ రెప్రజెంటెడ్ బై ఒన్ ఆఫ్ పాట్నర్ కాటసాని దివ్య, సుమారు 26 సం॥, తండ్రి కాటసాని చంద్రశేఖర్ రెడ్డి, ఇంటి.నెం.1-78, పెండికంటి నగర్, బనగానపల్లె మండల్, కర్నూలు జిల్లా.
.... ప్రపోజ్ పార్టీ/ (3) రెస్పాండెంటు

వాది 1,2 ప్రతివాదుల పైన పర్మినెంటు ఇంక్షను మరియు డిక్లరేషన్ దావా దాఖలు చేసినాడు. సదరు దావాలో ప్రతివాదిగా చేర్చుటకు అర్జీదారుడు **I.A.NO. 2142/2022** ప్రపోజ్ పార్టీ అర్జీ దాఖలు చేయగా కోర్టు వారు 3వ రెస్పాండెంటు నోటీసుకు గాను 28-08-2023వ తేదికి వాయిదావేసినారు. 3వ రెస్పాండెంటుకు యెమైన ఆక్షేపణలు ఉన్న యెడల ఉదయం 10.30 గంటలకుపై కోర్టుకు హాజరై అక్షేపణలు తెలుపకొన వలెయును. లేనంతట ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేది: 28.08.2023
వి. రామచంద్రారావు గారు
అర్జీదారు అడ్వకేటు, నంద్యాల,

మహారాజశ్రీ బనగానపల్లె జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.NO-7/2017 O. S. NO-73 / 2016

పెద్ద కొక్కల పెద్ద బాలసుబ్బన్న. ...D.H.R.
VS
ముద్దవరం లక్ష్మమ్మ.
...J.D.R.

వేలం ప్రకటన

J.D.R తాలూకు క్రింది షెడ్యూల్ భూమిని పై కోర్టు వారి ఎదుట 16- 08- 2023 వ తేదీన ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం5-00 గంటల లోపు బహిరంగ వేలం వేయుదురు. కొనదలిచిన వారు పై కోర్టులో హాజరై వేలంలో పాల్గొన వచ్చును

షెడ్యూల్

కర్నూలు జిల్లా, నంద్యాల రిజిస్ట్రేషన్ డిస్టిక్, బనగానపల్లె రిజిస్ట్రేషన్ సబ్ డిస్టిక్, ఎనకండ్ల గ్రామంలోని భూమికి నెంబర్ వారి వివరములు.
సర్వేనెంబర్ విస్తీర్ణము
..Ac.Cents
132/1 పైకి. 1-72. 1/2
చెక్కుబంది- తూర్పు- కొక్కల సంజన్న భూమి,
పడమర -కొక్కల చిన్న బాలసుబ్బన్న భూమి,
ఉత్తరం- సుబ్బరాయుడు భూమి, దక్షిణం -వాగు.
D.H.R Value Rs.1,00,000
F.A. Value Rs.4,00,000
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వేలం తేదీ-16-08-2023

ఇట్లు
మునగల పరశురామిరెడ్డి,
D.H.R పరం అడ్వకేట్, బనగానపల్లె.

బిజెపిని, మోడీని దేశం నుండి తరిమివేయాలి

(5వ పేజీ తరువాయి..) నుండి కార్మికులకు ఉన్న 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదింపు చేసి పెట్టుబడుదారులకు, కార్పొరేట్ సంస్థలకు నయా బానిసలుగా చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తుందని ఎలిపారు. ప్రజల సంక్షేమాన్ని మరిచిపోయి కార్పొరేట్లకు అప్పనంగా ప్రభుత్వ రంగ సంస్థలను అప్పజెబుతుందన్నారు. రైతులకు మూడు చట్టాలను తీసుకువచ్చి వెనక్కి తీసుకునే సందర్భంలో ఇచ్చిన హామీలను నేటి వరకు నెరవేర్చకపోవడం దుర్మార్గం అన్నారు. వ్యవసాయ కార్మికులకు 200 రోజులు పని కల్పించి 600 రూపాయలు రోజువారి వేతనం ఇవ్వాలని, పట్టణంలో ఉపాధి హామీ పనిని చేపట్టాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, నిరుద్యోగాన్ని నిర్మూలించాలన్నారు. దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టకుండా, మరిన్ని విద్వేషాలను రెచ్చగొడుతున్నా పట్టించుకోకుండా మహిళల హక్కులను బిజెపి కేంద్రమంత్రులు, ఎంపీలతో సహా ధిక్కరిస్తున్నారని, ఇటీవల మణిపూర్లో మహిళలపై జరిగిన దాడులను చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమని అన్నారు. వీటన్నింటి నుండి దేశాన్ని కాపాడుకోవాలంటే తప్పకుండా బిజెపిని, మోడీని దేశం నుండి తరిమివేయాలని, క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, మహిళలు, ఉద్యోగులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు శంకర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు తోటమద్దులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, కె.మహమ్మద్ గౌస్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి వెన్న బాల వెంకట్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మలమ్మ, ఐఎఫ్‌టియు జిల్లా కోశాధికారి చౌడప్ప, నాయకులు మహమ్మద్ రఫీ, మహమ్మద్‌తోపాటు అంగన్వాడీ నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** దేశంలో నరేంద్ర మోడీ 9 సంవత్సరాల పరిపాలనలో కార్మికులకు, ప్రజలకు అనేక ఇబ్బందులు తప్ప ఒరిగిందేమీ లేదని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం విమర్శించారు. పట్టణంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట దేశ రక్షణ, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకై 'క్విట్ మోడీ సేవ్ ఇండియా' పేరుతో ఈ దేశం నుంచి నరేంద్ర మోడీని సాగనంపాలని సిఐటియు, ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. సిఐటియు పట్టణ కార్యదర్శి డి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు ఏ రణధీర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, రైతు సంఘం అధ్యక్షులు మాభాష, కార్యదర్శి వీరన్న, వ్యకాసం జిల్లా నాయకులు స్వాములు, రైతు సంఘం నాయకులు పాల శివుడు, అంబయ్య, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు మంజుల, విజయలక్ష్మి, రవణమ్మ, లలితమ్మ, సిఐటియు నాయకులు పుల్లయ్య, నూర్, గణపతి, రఫీ, సామెలు, ఘోరా, రమణ, సలీం పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సెంట్రల్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. వ్యకాస జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే.భాస్కర్ రెడ్డి మాట్లాడారు. వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి పి పక్కిరి సాహెబ్, జిల్లా నాయకులు టి. ఓబులేష్, సుజ్ఞానం, తిరుపతయ్య, సిఐటియు జిల్లా నాయకులు టి.గోపాలకృష్ణ, నాగమణి, శివయ్య, నరసింహ, రైతు సంఘం నాయకులు ఏసన్న, రామకృష్ణ, నాగన్న పాల్గొన్నారు. **బేతంచెర్ల :** బేతంచెర్లలోని ప్రజా సంఘాల కార్యాలయం నుండి సిఐటియు పట్టణ కమిటీ సభ్యుడు బి.రామాంజనేయులు అధ్యక్షతన ర్యాలీగా వెళ్లి స్థానిక పోస్టాఫీస్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. సిఐటియు, రైతు సంఘం, వ్యకాసం, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు వైబి.వెంకటేశ్వర్లు, ఆర్.ఈశ్వరయ్య, జి.షేభారాణిలు మాట్లాడారు. అనంతరం వినతి పత్రాన్ని సబ్ పోస్ట్‌మాస్టర్ బాలయ్యకి అందజేశారు. ప్రజా సంఘాల నాయకులు సంజీవ నాయుడు, నారాయణరెడ్డి, సీతారాపురం వెంకటేశ్వర్లు, రాజబాబు, వెంకటరమణ, నరసింహ, నాగరాజు, ఆర్.వెంకటలక్ష్మి, నాగేంద్రమ్మ, నాగలక్ష్మి, ఎస్‌కె. భాష, రహంతుల్లా, రాముడు, మల్లికార్జున, రజాక్, శీను, రామళ్లకోట భాష పాల్గొన్నారు. **బనగానపల్లె రూరల్ :** సిఐటియు డివిజన్ అధ్యక్షులు జీవీ సుబ్బయ్య ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం నుండి పెట్రోల్ బంకు సెంటర్కు వరకు ర్యాలీగా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి రోజా రమణి, సరస్వతి, బ్రహ్మావతి, ప్రభావతి, వెంకట లచ్చుమ్మ, ఆటో యూనియన్ కార్యదర్శి దస్తగిరి, భాస్కర్, ప్రసాద్ పాల్గొన్నారు. **పాములపాడు :** పాములపాడులోని పోస్ట్ ఆఫీస్ ఎదుట మోడీ హటావో- దేశ్ బచావో పేరుతో నిరసన కార్యక్రమాన్ని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.రామేశ్వరావు మాట్లాడారు. అనంతరం కార్మిక, కర్షక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని సబ్ పోస్ట్ మాస్టర్ బి.ఖాజా మొహిద్దీన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి టి. వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు డి.స్వామన్న, సిఐటియు నాయకులు పి.ఈశ్వర్, రైతు సంఘం నాయకులు ఎస్ఆర్. రమణ, బాల యేసు, రంగస్వామి, అంజలి, పుల్లయ్య, రామకృష్ణుడు, సేవా భారతి యూత్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.షర్ఫుద్దీన్ అలీ పాల్గొన్నారు. **డోన్ :** పట్టణంలో ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రంగనాయకులు మాట్లాడారు. నాయకులు రామ్ నాయుడు, గిడ్డయ్య, గోపాలు, మధు, మల్లికార్జున, కుమార్, సురేషు, శివ పాల్గొన్నారు.

ఆత్మకూరులో...

నందికొట్కూరులో...

పాములపాడులో...

డోన్‌లో...